Regd: No H. 634 Andhra Janatha Hyderabad 4 పేజీలు 7 నయాపైసలు

ఆంధ్రజనత

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

హైదరాబాద్, గురువారం 13-8-1959

సంపుటి 5 సంచిక 52

ఆంధ్రజనత
చందా వివరాలు
సంవత్సరం రూ. 27-00
6 నెలలు రూ. 14-00
3 నెలలు రూ. 7-00
మూడు నెలలకు తక్కువ చందా స్వీకరించబడదు
వివరాలకు:
మేనేజర్,
ఆంధ్ర జనత
గాంధీ భవనం హైదరాబాదు.

బొంబాయి అసెంబ్లీ సభ్యులకు హెచ్చు భత్యం

బొంబాయి, ఆగస్టు 12

నెలవారీ జీతంతో పాటు (రూ. 150) అసెంబ్లీ సభ్యులకు ఏక మొత్తంగా 100 రూపాయలు భత్యం ఇవ్వటానికి సంబంధించిన బిల్లును బొంబాయి అసెంబ్లీ నేడు ఆమోదించింది.

1956 బొంబాయి అసెంబ్లీ సభ్యుల జీత భత్యాల చట్టానికి సవరణగా ఈ బిల్లు ప్రతిపాదించబడినది.

బియ్యం నిల్వల స్వాధీనానికి రాష్ట్ర ప్రభుత్వం చర్య

శ్రీ బూర్గుల పదవీ విరమణ వార్త

వట్టి పుకారేనని వెల్లడి

మధుర, ఆగస్టు 12

కేరళ గవర్నర్‌గా మరొకరిని నియమిస్తున్నారనే విషయంలో తమ కేమీ తెలియదని గవర్నర్ శ్రీ బి. రామకృష్ణరావు నేడిక్కడ విలేఖరులతో అన్నారు.

ప్రధాని, తదితర కేంద్ర మంత్రులతో చర్చలు జరిపి త్రివేండ్రం తిరిగి వెడుతున్న శ్రీ రామకృష్ణరావును ఆయన గవర్నర్ పదవి నుంచి విరమించు కొంటున్నారని కొన్ని పత్రికలలో పడిన వార్త గురించి విలేఖరులు ప్రశ్నించారు.

ప్రశ్న:-మీరీ పదవిలోఉంటారా?

శ్రీ రావు:-అందుకు వ్యతిరేకంగా నేనేమీ వినలేదు. ఒక ఢిల్లీ పత్రిక విలేఖరి వ్రాసిన ఆ వార్తను నేను చూచాను.

గంగానది విజృంభణ

వారణాసి, ఆగస్టు 12

నిన్నటి ప్రమాద సంకేతాన్ని దాటి పోయిన గంగానది నీటిమట్టం గత 24 గంటల్లో మరో 1.25 అడుగులు పెరిగినది.

నేటి ఉదయానికి నీటిమట్టం ఎత్తు 235.30 అడుగులు, ప్రమాద సంకేతానికి 1.50 అడుగులు ఎక్కువ.

ప్రత్యేకాధికారాల స్వీకరణ

కంట్రోల్ రేటు ప్రకారం సరుకు స్వాధీనం చేసుకోవటానికి ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 12

రాష్ట్రంలో మిల్లర్లు, వ్యాపారస్తుల వద్ద ఉన్న బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకోవటానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నేడు ఉత్తర్వులను జారీ చేసినది.

ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని ప్రతి మిల్లరు, వ్యాపారస్తుడు (1) ప్రస్తుతం (అంటే ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చినది మొదలు) తన వద్ద ఉన్న మొత్తం నిల్వలలో 40 శాతం బియ్యాన్ని కంట్రోల్ ధరల ప్రకారం (రిక్విజిషన్ అధికారి నోటీసును పురస్కరించుకొని) రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మాలి. (2) ఈ ఉత్తర్వులు అమలులోకి వచ్చిన నాటి నుంచి ప్రతిదినం కొనే బియ్యంలో కూడా 40 శాతాన్ని ప్రభుత్వానికి అమ్మాలి.

ఈ ఉత్తర్వులు మొత్తం రాష్ట్రం అంతటికీ వర్తించి వెంటనే అమలులోకి వస్తాయి.

ఈ ఉత్తర్వుల క్రింద ప్రభుత్వానికి అమ్మవలసిన బియ్యంలో శాతం రేటును అవసరాన్నిబట్టి గెజిట్ ప్రకటనల ద్వారా ప్రభుత్వం మార్చవచ్చు.

ఉత్తర్వుల వివరాలు అధికారికంగా నేడే పత్రికలకు విడుదల చేయబడ్డాయి.

బియ్యం ధరల పెరుగుదల

కొన్ని ప్రాంతాలలో మాత్రమే అని శ్రీ జెయిన్ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 12

దేశం అంతటా అన్ని ప్రాంతాల్లో బియ్యం ధరలు పెరిగి పోయాయన్న వార్తలు నిజం కావని కేంద్ర ఆహార మంత్రి శ్రీ అజిత్ ప్రసాద్ జెయిన్ నేడు లోక్ సభలో ప్రకటించారు.

శ్రీ ఎస్.ఎమ్. బెనర్జీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఏవో కొన్ని ప్రాంతాలలో మట్టుకే ధరలు పెరిగాయనీ, మిగతా ప్రాంతాలలో ధరలు 1958 నాటి కంటె తక్కువగా ఉన్నాయనీ ఆయన అన్నారు. 1958-60లో బియ్యంఉత్పత్తి 4.5 మిలియన్‌ల టన్నులు పెరిగిందని ఈ సందర్భంలో ఆయన ఉదహరించారు.

రాష్ట్ర అసెంబ్లీలో గందరగోళం

వాయిదా తీర్మానం సందర్భంలో సభలో అరుపులు, పెడబొబ్బలు

హైదరాబాద్, ఆగస్టు 12

రాష్ట్రఅసెంబ్లీలో నేడు కాంగ్రెస్ సభ్యులు, కమ్యూనిస్టు సభ్యులు ఒకరిపైఒకరు అరుపులు, పెడబొబ్బలు విసురుకొని కంఠాలు చించు కోవడంతో సభా భవనం అంతా పది నిమిషాల పాటు నానా కోలాహలంగా మారిపోయి చెవులు చిల్లులు పడ్డాయి.

ఈ గందరగోళం అంతకీ కారణం ఒక వాయిదా తీర్మానం. తెలంగాణా ప్రాంతంలో కల్లుగీత సహకార సంఘాలు ఎక్సైజ్ కాంట్రాక్టులు ఇచ్చే విషయంపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించక పోవటాన్ని గూర్చి సభ్యులు (నలుగురు) ఒక వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. తీర్మానాన్ని చర్చకు అంగీకరించటమూ, అంగీకరించక పోవటమూ అన్న విషయాన్ని తేల్చబోతున్న సమయంలో సభ్యులమధ్య అరుపులు, పెడబొబ్బలు చెలరేగినవి వేర్కొన్న విధంగా చెవులు చిల్లులు పడ్డాయి. ప్రతిపక్ష సభ్యులు తమ వాయిదా తీర్మానంలో "అధికారంలో ఉన్న పార్టీవారు ఎక్సైజ్ కాంట్రాక్టు లన్నిటినీ తమ జేబు సంఘాలకు సంక్రమింప జేసే ఉద్దేశంతో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలను పూర్తిగా అలక్ష్యం చేయడం జరుగుతోంది" అరోపించారు.

ప్రతిపాదకులలో ఒకరు, ఆ తర్వాత స్థానిక స్వపరిపాలనా మంత్రి శ్రీ డి. సంజీవయ్య గారు ప్రసంగించిన తర్వాత తీర్మానం పై ఒక గంట సేపు చర్చించటానికి అనుమతిస్తున్నానని స్పీకర్ ప్రకటించారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ సుందరయ్య గారు (విషయాన్ని పూర్తిగా చర్చించటానికి) గంట సేపు చాలదని అన్నారు. మధ్యలో ఒక కాంగ్రెస్ సభ్యుడు లేచి గంటసేపు చాలుతుందని అనగా "మీరు చేసే వైభవ పనులను" చర్చించటానికి గంటసేపు కాదు, ఒకరోజు రోజంతా కూడా సరిపోదని శ్రీసుందరయ్యగారు తీవ్రంగా ఒక వాగ్బాణాన్ని విసిరారు. దానితో అరుపులు, పెడబొబ్బలు ప్రారంభమయాయి. కాంగ్రెస్ సభ్యులు లేని సుందరయ్యగారు ఉపయోగించిన నూట పాత్రల మెంటరీ సంప్రదాయాలను పెక్కిరిస్తున్నట్టుగా ఉందనీ, ఆయన దాన్ని ఉపసంహరించుకోవాలనీ అన్నారు. సుందరయ్యగారిని ఉద్దేశించి ఒక కాంగ్రెస్ సభ్యుడు "మమరు నోరు మూసుకోండి" అని అనెడాడు. దానితో పెడబొబ్బలు ఎక్కువై పోయాయి. ఇరు పక్షాల వారు లేచి నుంచుని కెట్టుగా అరుచుకున్నారు. "మీరు నోరు మూసుకోవాలం టే మీరు నోరు మూసుకోవాలి" పది నిముషాల పాటు ఇలా హోరాహోరీగా అరుపులు, పెడబొబ్బలు సాగిపోయాయి.

సుందరయ్యగారు తాను అన్న మాటను సవరించి ఉపసంహరించుకోనని అన్నారు. ఇంకా ఆ మాట కొస్తే దాన్ని పదే పదే అంటానని కూడా అన్నారు.

ఈలోగా అంత వరకు సభలో లేకుండా ఉన్న ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు అప్పుడే లోపలికి వచ్చి "వయసేసే సభ్యులు ఆవేశాలు పెంచుకోవద్దని" విజ్ఞప్తి చేశారు.

కాస్సేపటికి వేడి చల్లారింది. తన మాటను ఉపసంహరించుకోవలసిందిగా స్పీకర్ సుందరయ్యగారిని కోరారు.

సుందరయ్యగారు దానికి అంగీకరించి ప్రభుత్వ చర్యను వర్ణించటానికి మరో భూషైన ప్రయోగిస్తానని, లోగడ అన్నదానికి బదులు "పచ్చి దుర్మార్గం" అని అంటానని అన్నారు.

తీర్మానంపై రేపు రెండుగంటల పాటు చర్చ జరపటానికి స్పీకర్ అనుమతించారు.

వనస్పతి నూనెలు ఆరోగ్యానికి హానికరం

లోక్‌సభలో మంత్రి వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 12

వనస్పతి నూనెలు తినటం ఆరోగ్యానికి హానికరమా అని లోక్‌సభలో సభ్యులు నేడు పదే పదే ప్రశ్నించారు.

ఆరోగ్య మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ సమాధానమిస్తూ ఇంత వరకు జరిగిన ప్రయోగాలను బట్టి చూస్తే వనస్పతి నూనెలే కాక నెయ్యి కూడా అధికంగా వినియోగించినట్టయితే "కరోనరిథ్రాంబోసిస్" (నొసటిలో రక్తం గడ్డకట్టుకు పోగా వచ్చే ఒక జబ్బు) వస్తుందని అన్నారు.

ఇప్పుడు మంత్రిగారు చెప్పినట్టుగా శాస్త్రీయమైన నిర్ణయాల దృష్ట్యానే ప్రధాని ఇంట్లో వనస్పతి నూనెలు పూర్తిగా నిషేధించబడినాయని మంత్రిగారికి తెలుసా? ప్రజలు కూడా అలాగే చేయాలని సలహా ఇస్తారా అని శ్రీ హెచ్. సి. మాథుర్ ప్రశ్నించారు.

అలాటి నూనెలను నిషేధించి, తాజా నూనెలను వాడటమే మంచిదని మంత్రి అన్నారు.

సభ్యులు ఇంకా అనేక అనుబంధ ప్రశ్న లడగటానికి లేచినిల్చోగా అప్పుడు అధ్యక్షస్థానంలో ఉన్న డిప్యూటీ స్పీకర్ ఇది (వనస్పతి వినియోగం) మితిమీరి పోతే మంచిదికాదని మంత్రిగారు ముందే చెప్పారని చమత్కరించారు.

ఈ విషయం చాలా ముఖ్యమైనదిగనుక ఇంకా అనుబంధ ప్రశ్నలకు అనుమతి నివ్వాలని సభ్యులు కోరారు. ఇక ప్రశ్నలకు అవకాశం లేదని సభ్యుడెవైనా కోరినట్లయితే కొంచెంసేపు చర్చకు అవకాశముంటుందేమో చూస్తానని డిప్యూటీ స్పీకర్ అన్నారు. అంతకుముందు ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఆరోగ్యమంత్రి వనస్పతినూనె ఉత్పత్తిని, వినియోగ దార్లపై వాటి ప్రభావాన్ని పరిశీలించటానికి కమిటీని నియమించే ఆలోచన లేదని మంత్రి చెప్పారు.

బొమ్మార్లు కేసిల్, ఆగస్టు 12

బ్రిటిష్ రాణి ఎలిజబెత్ ఘనా ప్రధాని డాక్టర్ క్వామె ఎన్ క్రుమాను ప్రివీ కౌన్సిల్ సభ్యుడుగా నియమించినది.

రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీ విధానాలు

కేరళ కాంగ్రెస్, ప్రజా సోషలిస్టు నాయకుల చర్చలు

త్రివేండ్రమ్, ఆగస్టు 12

రానున్న ఎన్నికల దృష్ట్యా తమ తమ పార్టీల విధానాలను గూర్చి కాంగ్రెస్, ప్రజా సోషలిస్టు నాయకులు నేడు ఇక్కడ లాంఛనంగా చర్చలు జరిపారు.

కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఆర్. శంకర్, పి. టి. ఛాకో, ప్రజా సోషలిస్టుపార్టీ తరఫున శ్రీ పట్టం థాను పిళ్ళై, కుంబలతుసంకు పిళ్ళైగార్లు చర్చలలో పాల్గొన్నారు. విమోచన సమర సమితి నాయకుడు శ్రీ మన్నాత్ పద్మనాభన్ కూడా చర్చలలో పాల్గొన్నారు.

ఎన్నికలకు సంబంధించిన విషయాలను గూర్చి కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు సభ్యులతో సమాలోచనలు జరపటానికిగాను శ్రీ శంకర్ రేపు ఢిల్లీ వెళుతున్నారు.

నేడు జరిగినవి ప్రాథమిక చర్చలు మాత్రమే అనీ, అయినప్పటికీ ఎన్నికలలో ప్రతిపక్షాల వారంతా కలసి పని చేయాలన్న భావాన్ని అంతా వ్యక్తపరిచారనీ పి. టి. ఐ. విలేఖరితో శ్రీ శంకర్ తర్వాత అన్నారు.

ఎన్నికలకు సంబంధించి పార్లమెంటరీ బోర్డు సభ్యులతో సమాలోచించిన తర్వాతనే తన పార్టీ కల్పితమైన విధానం అవలంబిస్తుందని ఆయన అన్నారు.

అమెరికా వాణిజ్య ప్రతినిధులు

విజయవాడ రాక

విజయవాడ, ఆగస్టు 12

శ్రీ ఎడ్విన్ సి. హిగ్బీ నాయకత్వాన నేడు ఇక్కడికి వచ్చిన అమెరికా వాణిజ్య ప్రతినిధులు (ఆరుగురు) విజయవాడలోను, నగర పరిసరాల్లో ఉన్న ఫ్యాక్టరీలకు వెళ్ళి వాటిని చూశారు.

తర్వాత వారు ఇండియా-అమెరికా మధ్య వాణిజ్యాభివృద్ధికి గల అవకాశాలను గూర్చి విజయవాడ వాణిజ్య మండలి వారితోను, స్థానిక వర్తక ప్రముఖులతోను చర్చలు జరిపారు.

దక్షిణ ఇండియా రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీ జి. ఎస్. రాజుగారు ప్రతినిధి వర్గం వారిని స్థానిక వర్తకులకు పరిచయం చేశారు.

కేరళ విద్యా చట్టం నిబంధనల సవరణ

పాఠశాలల గుర్తింపు విషయంలో

త్రివేండ్రమ్, ఆగస్టు 12

పాఠశాలల గుర్తింపును ఉపసంహరిస్తూ కేరళ విద్యా చట్టం క్రింద జారీ చేయబడిన ఆజ్ఞలను తిరిగి పునః పరిశీలించటానికి వీలుగా విద్యాచట్టానికి సంబంధించిన నిబంధనలను కేరళ ప్రభుత్వం సవరించినది.

దీని ప్రకారం పాఠశాలల యజమానుల నుంచి వచ్చే దరఖాస్తులను పురస్కరించుకొని 'గుర్తింపు ఉపసంహరణ ఆజ్ఞలను' పునః పరిశీలించటానికి జిల్లా విద్యాశాఖాధికారులకు అధికారాలు ఇవ్వబడతాయి.

మొదట చేసిన నిబంధనల్లో ఇటువంటి దానికి అవకాశంలేదు.

పాఠశాలల మూసివేత ఉద్యమం సందర్భంగా ఇటీవల మలబార్ ప్రాంతంలో 95 పాఠశాలలకు గాటి గుర్తింపును ఉపసంహరిస్తూ నోటీసులు జారీ చేయబడినట్టు అధికార వర్గాలవారు అన్నారు. పాఠశాలల యజమానులు ఈ విషయంలో తిరిగి దరఖాస్తులు పెట్టుకొని తమ పాఠశాలలను గుర్తించ వలసినదిగా కోరటానికి ఈ సవరణ అవకాశం ఇస్తుందని వారు అన్నారు.

ఫ్రెంచి యువతిని పెండ్లాడిన భారతీయ యువకుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

మూడేళ్ళనాడు హేమ్‌చంద్ జైన్ అనే భారతీయ యువకుడు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్టుగ్రాడ్యుయేటు డిగ్రీ సంపాదించే నిమిత్తం అమెరికా వెళదామని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. ఫుల్ బ్రైట్ ట్రావెల్ గ్రాంటు కూడా లభించింది. కాని తాను ఉన్నత విద్య నభ్యసించటంకోసమే ఇల్లినాయ్ యూనివర్శిటీలో చేరిన తర్వాత అయే ఖర్చులు భరించటమనేది ఒక పెద్ద సమస్యగా అతనిని వేధింపసాగింది.

ఇల్లినాయ్‌లో విద్యార్థిగా చేరినాలుగు నెలల లోపలనే తన సమస్యకు పరిష్కార మార్గం గోచరమయింది. ఆ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడుగా ఆయనను నియమించారు.

ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో "ఆత్మ స్థైర్యం అంటూ అప్పుడు కలిగిందనారు" అన్నాడాయన.

ఈ ఆత్మ స్థైర్యంతోనే ఆయన ఎన్నో విజయాలు సాధించాడు. ఇల్లినాయ్‌లో విద్య పూర్తయినతర్వాత, ఇవాన్స్‌విల్ కాలేజీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లెక్చరర్‌గా చేరాడు. అయన అమెరికా నుంచి వచ్చేసే ముందు డాక్టరేట్ డిగ్రీ కూడా తీసుకుంటాడు.

శ్రీ జైన్ ప్రస్తుతం భారత దేశంలో ఉన్నాడు. 1958 లో అమెరికాలో ఈయన బినీవీల్ అనే యువతిని పెళ్ళి చేసుకున్నాడు. ఆమెను కూడా వెంట తీసుకు వచ్చాడు.

ఈమె ఫ్రెంచి యువతి. వర్జీనియాలో ఫుల్ బ్రైట్ స్కాలర్‌షిప్‌తో ఇంగ్లీషు చదువుతుండేది. 1958 లో క్రిస్‌మస్‌లో మిషిగన్ స్టేట్ యూనివర్శిటీలో జరిగిన అమెరికాలోని విదేశ విద్యార్థుల సమావేశ సందర్భంలో వీరిద్దరికీ తొలి పరిచయమయింది.

జైన్ దంపతులు సెప్టెంబరులో అమెరికాకు తిరిగి వెళతారు.

సప్లిమెంటరీ డిమాండ్లకు అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 12

రెవెన్యూ, పెట్టుబడి, అప్పు పద్దుల క్రింద 2,30,94,000 రూపాయల అదనపు ఖర్చుకు సంబంధించిన సప్లిమెంటరీ గ్రాంటులను ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ నేడు ఆమోదించినది.

1958-59 సంవత్సరానికి గాను ఆదిలో తలపెట్టని లేదా ఊహించని కొన్ని పనులకు గాను చేసిన అదనపు ఖర్చు నిమిత్తం పై సప్లిమెంటరీ డిమాండులు ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రవేశ పెట్టారు.

ఏ సంవత్సరానికి సంబంధించిన ఖర్చు ఆ సంవత్సరం లోనే ప్రకటించాలంటూ కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె. రామచంద్రా రెడ్డి సప్లిమెంటరీ డిమాండులకు అభ్యంతరం చెప్పారు. ఇట్టి ఖర్చులకు సంబంధించిన డిమాండులను మరుచటి సంవత్సరానికి వాయిదా వేయరాదని ఆయన అన్నారు. మంత్రిగారు అనుసరించిన పద్ధతి రాజ్యాంగ సూత్రాలకు, అమలులో ఉన్న సంప్రదాయాలకు విరుద్ధమని ఆయన అన్నారు.

అయితే, స్పీకర్ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు శ్రీ రెడ్డి గారి అభ్యంతరాన్ని త్రోసిపుచ్చారు. అయితే, సప్లిమెంటరీ డిమాండులు ఏవైనా ఉన్నట్లయితే, వాటిని సాధ్యమైనంత త్వరగా ప్రవేశ పెట్టవలసిందిగా ప్రభుత్వానికి ఆయన సలహా ఇచ్చారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో భారీ పరిశ్రమలను స్థాపించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికినచ్చజెప్పలేక పోయినదని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ నాగిరెడ్డి అన్నారు. దక్షిణాదిన రెండు చేతి గడియారం ఫ్యాక్టరీలను స్థాపించే సంకల్పం ఉన్నట్టు వింటున్నాం. వీటిలో ఒకటి తెనుగుపూరులోను, రెండవది మద్రాసులోను నెలకొల్పుతారని ప్రకటించారు. బహుశా, కేంద్ర ప్రభుత్వానికి దక్షిణాదిన ఆంధ్ర ప్రదేశ్ అనే రాష్ట్రం ఉన్నట్టు అసలు జ్ఞాపకం లేదేమో అన్నారు శ్రీ నాగిరెడ్డి.

రాజకీయ బాధితుల పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించే విధానాన్ని శ్రీ నాగిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. వెనుక బడిన తరగతుల వారి పిల్లలకు ఉచిత మధ్యాహ్నం భోజన

(మిగతా 4వ పేజీలో)

కృశ్చేవ్‌కు సమితి ప్రధాన కార్యదర్శి ఆహ్వానం

జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించటానికి

ఐక్యరాజ్య సమితి, ఆగస్టు 12

వచ్చేసేలఅమెరికా పర్యటనకువచ్చిన సుమారు 82 దేశాల జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించ వలసిందిగా రష్యా ప్రధాని నికిటా కృశ్చేవ్‌ను ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆహ్వానించినట్టు నిన్న రాత్రి ఇక్కడ తెలిసినది.

కృశ్చేవ్ అమెరికా రానున్నట్టుప్రకటించ బడిన రెండురోజుల తర్వాత ఈ ఆహ్వానం పంపించినట్టు సమితి ప్రతినిధి ఒకడు చెప్పాడు.

కృశ్చేవ్ బహుశా సెప్టెంబర్ 18నాడు లేదా ఆతర్వాత సమితికి రావచ్చునని అధికారులు పేర్కొన్నారు. ఆయన సెప్టెంబర్ 19 వ తేదీ నాడు అమెరికా వస్తున్నారు.

సాధారణంగా జనరల్ అసెంబ్లీ ప్రారంభ సమావేశాలలో ప్రతి దేశం ప్రతినిధి వర్గ నాయకుడు చేసే విధాన ప్రసంగాన్ని ఈసారి కృశ్చేవ్ స్వయంగా చేయడం సంభవమని పరిశీలకులు భావిస్తున్నారు. సాధారణపరిస్థితులలో రష్యా విదేశాంగ మంత్రి శ్రీ ఆండ్రీగ్రోమికో ఈ ప్రసంగం చేసేవారు.

ఒక వేళ తమదేశం విధానాన్ని వివరిస్తూ కృశ్చేవ్ ప్రసంగించిన పక్షంలో అమెరికా విధానాన్ని వివరించే రిప్రసంగం చేయటానికి అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ వాషింగ్‌టన్ నుంచి ఇక్కడికిరావచ్చునని కూడా భావిస్తున్నారు.

రాష్ట్రాలలో రవాణా సహకార సంఘాలు

పథకం సిద్ధం చేయబడినట్టు ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 12

రాష్ట్రాలలో రవాణా సహకార సంఘాలు నెలకొల్పటానికి సంబంధించిన పథకం పూర్తి అయిందని రవాణా, కమ్యూనికేషన్‌ల శాఖకు సంబంధించిన మంత్రి శ్రీ రాజబహదూర్ నేడు లోక్‌సభలో శ్రీ ఎస్. హన్స్‌దా అడిగిన ప్రశ్నకు సమాధానంగా వెల్లడించారు.

పథకాన్ని అమలు పర్చటానికి అంగీకరించే రాష్ట్రాలకు ఎంత ధనసహాయం చేయవలసివచ్చేదీ వివరాలుతయారైనాయనీ, సంఘాలను నడపటానికి అవసరమయే సిబ్బంది శిక్షణ త్వరలోనే ప్రారంభమౌతుందనీ ఆయన అన్నారు.

సహకార ప్రాతిపదికపై ఒక పట్టణ ప్రాంతంలో రవాణా సర్వీసులు నిర్వహించటం ఈ సంఘాలు ప్రధానంగా చేపేవని,

పటేల్ రాజీనామా అంగీకారం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

ఆర్థికశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ హెచ్. ఎమ్. పటేల్ రాజీనామా అంగీకరించ బడినదని దేశీయ వ్యవహారాలకు సంబంధించిన మంత్రి శ్రీ బి. ఎన్. దాతార్ నేడు రాజ్య సభలో శ్రీ ఎ. కె. ఘగే అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలియ జేశారు.

బొంబాయి కేడర్‌లో పేర్కొనబడిన ఫలితంగా బొంబాయి ప్రభుత్వానికి ఆయన తన రాజీనామా అందజేశాడనీ, అదిఅంగీకరించ బడిందనీ శ్రీ దాతార్ అన్నారు.

ఛాగ్లా కమిషన్, బోస్ కమిటీల ముందు విచారణ సమయంలో తన సహోద్యోగులు తనతో తగినంత సహకరించక పోవటం వల్లనే ఆయన రాజీనామా ఇచ్చారా అని శ్రీ ఘగే ప్రశ్నించారు. రాజీనామా ఇవ్వటానికి అసలు కారణం ఏమిటో తెలుసుకోగోరుతున్నానని ఆయన అన్నారు.

మంత్రి సమాధానం: "ఏమీ లేదు, ఆయన మామూలుగా రాజీనామా ఇచ్చారు."

సభ్యుడు వెల్లడించిన అభిప్రాయాలను ఆంగీకరించ జాలకని కూడా ఆయన అన్నారు.

శ్రీ భూపేష్ గుప్త: శ్రీ పటేల్

స్వతంత్ర పార్టీలో జేరారా?

సమాధానం లేదు. సభ్యులంతా ఒకటే నవ్వు.

తుంగభద్ర ప్రాజెక్టు ఎడమకాల్వ వివాదం

వచ్చే నవంబర్‌లో ఆంధ్ర, మైసూర్ ప్రభుత్వాల చర్చలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

పూర్వ హైదరాబాద్ ప్రభుత్వం ఉద్దేశించినట్టు తుంగభద్ర ప్రాజెక్టు ఎడమకాల్వ పథకాన్ని అమలు జరిపే అవకాశాల విషయమై విభేదాల పరిష్కారానికిగాను వచ్చే నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్, మైసూర్ ప్రభుత్వాల మధ్య చర్చలు జరగ గలవని ఇరిగేషన్ ఉపమంత్రి శ్రీ జైశుక్‌లాల్ హాథీ నేడు లోక్‌సభలో వెల్లడించారు.

శ్రీయుతులు నాగిరెడ్డి, టి. బి. విఠల్ అడిగిన ప్రశ్నకు సమాధానంలో ఆయన పైవిషయాన్ని తెలియ జేసారు.

ఉభయ ప్రభుత్వాల మధ్య విభేదాలు పరిష్కారం కాక, ఒప్పందం కుదరని పక్షంలో కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించ గలదని కూడా ఉపమంత్రి తెలియ జేసారు. దురదృష్టవశాత్తు పూర్వ హైదరాబాద్ ప్రభుత్వం ఉద్దేశించిన తుంగభద్ర ప్రాజెక్టు వివరాలు కేంద్ర జల, విద్యుచ్ఛక్తి కమిషన్ వద్ద లేవని ఆయన అన్నారు.

న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, ఆగస్టు 12

నేటి ప్రారంభ ధర	32.07
నేటి ముగింపు ధర	32.01

కరాచీలో పలువురు అరెస్టు

కరాచీ, ఆగస్టు 12

స్వాతంత్ర్య దినోత్సవం నాడు అల్లరి లేవనెత్తటానికి సన్నాహాలు సాగిస్తున్న కొందరు వ్యక్తులను కరాచీ పోలీసులు నేడు అరెస్టు చేశారు. పోలీసులు ఈ సందర్భంలో ఒక ఇంటిపై దాడి జరిపి కొన్ని పోస్టర్లను స్వాధీన పర్చుకొన్నారు. పోస్టర్లు తలగడా గలీబులో దాచబడి ఉన్నాయట. పాకిస్తాన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాలు రేపు జరుగుతాయి.

ఆంధ్రదేశము నంతటిని ఉర్రూత లూగించిన సినిమా యాక్టర్ల కాంబినేషన్‌తో ఉత్తమ నాటక ప్రదర్శనము

14-8-59 నుండి హైద్రాబాద్ 'గాంధీభవన్' లో ప్రతిరోజు రాత్రి 8 గంటలకు

రవీ ఆర్టు థియేటర్స్ (మద్రాస్) వారిచే

రక్త కన్నీరు

నటవర్గము: నాగభూషణం (ఏది నిజం హీరో), శ్రీమతి సీత, దుర్గారావు, కృష్ణమూర్తి, సుజాత, అన్నపూర్ణ మొ॥

ఆంధ్రదేశములో 110 ప్రదర్శన లిచ్చిన నాటకము

రేట్లు రు. 5, 3, 2.

టిక్కెట్లు దొరుకు చోట్లు: గాంధీభవన్, నెల్లూరి రెడ్డిపాలెం టల్ పీనస్ డ్రగ్స్, కింగ్స్‌వే.

వికారినామ సంవత్సరం

గురువారం, ఆగస్టు 13, 1959
శ్రావణ శుద్ధ నవమి
నవమి ఉ॥ 6-19
దశమి రా॥ 3-51
అనూ మ॥ 11-5
వర్జ్యం మ॥ 4-19 మొ॥ 6-48 కు

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు: 4950

గురువారం, ఆగస్టు 13, 1959

లావోస్ పరిస్థితి

లావోస్‌లో తిరుగుబాటు చెలరేగటం అత్యంత విచారకరమైన విషయం. ఇది కమ్యూనిస్టు లేవదీసిన తిరుగుబాటని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. నిజానికి, తిరుగుబాటుకు ప్రోద్బలం ఉత్తర వియత్నాంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం నుంచి వచ్చిందని, తిరుగుబాటుదారులకు ఉత్తర వియత్నాం ప్రభుత్వం ఆయుధ సామగ్రిని అందజేస్తున్నదని లావోస్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఈ ఆరోపణలో నిజానిజాల మాట ఎలా ఉన్నా, లావోస్ పోరాటంలో ఏదో ఒక రూపంలో ఉత్తర వియత్నాం ప్రమేయం ఉండక తప్పదు. తన సరిహద్దులో సాగుతున్న పోరాటం విషయంలో ఏదేశం అలక్ష్యంగా ఉండజాలదు. మాస్కోలోని ఉత్తర వియత్నాం రాయబారి అప్పుడే లావోస్ పోరాటం పట్ల తన దేశం ఆందోళనను వ్యక్తం చేశాడు. లావోస్ పరిస్థితి చాలా ప్రమాదకరంగా పరిణమించినదని, అమెరికా సామ్రాజ్యవాదులు లావోస్‌లో జోక్యం కల్పించుకొని, లావోస్‌ను తమ సైనిక స్థావరంగా మార్చుకొనటానికి ప్రయత్నించటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీని వల్ల ఉత్తర వియత్నాం రిపబ్లిక్ భద్రత కుముప్పు ఏర్పడినదని ఆయన అన్నాడు. లావోస్ పశ్చిమ రాజ్యాలు ఏర్పాటు చేసిన "సీటో" అనే సైనికకూటమి ప్రాంతంలో ఉండటం మూలంగా దేశ భద్రత విషయంలో ఉత్తర వియత్నాం ప్రభుత్వం ఆందోళన చెందటంలో ఆశ్చర్యంలేదు. లావోస్ ప్రభుత్వం "సీటో" నుంచి సైనిక సహాయాన్ని అర్థించినట్లయితే, పరిస్థితి మరీ విషమించటం, యుద్ధ జ్వాలలు మరింత ప్రజ్వరిల్లటం, అగ్రరాజ్యాలు సైతం ఈ వ్యవహారంలో తలదూర్చే ప్రమాదం కూడా ఏర్పడటం సంభవించవచ్చు. జెనీవా ఒప్పందం ప్రకారం ఇండోచైనాలో యుద్ధ విరమణ జరిగినప్పటికీ, జెనీవా ఒప్పందం పూర్తిగా అమలు జరగలేదు. వియత్నాం ఉత్తర, దక్షిణ భాగాల ఏకీకరణ ఇప్పటికీ జరగలేదు. జెనీవా ఒప్పందంలో ఇది ఒక ముఖ్యాంశమైనప్పటికీ, దానిని జెనీవా ఒప్పందంతో సంబంధం ఉన్న దేశాలన్నీ పూర్తిగా విస్మరించినవి. వియత్నాం ఏకీకరణ ఇక సాధ్యం కాదన్న భావం ఏర్పడింది. దీని వల్ల సైగోనేమి, ఇండోచైనా దేశాలమధ్య గల పరస్పర సందేహాలు, అపోహలు, అనుమానాల వల్ల సైగోనేమి, వాటని పురస్కరించుకొని అవి చేసుకొన్న రక్షణ ఏర్పాట్ల వల్ల ఇండోచైనాలో సుస్థిర శాంతి ఏర్పడ లేదు. పైగా, అక్కడ యాపత్తూ ఒక విధమైన ఉద్రిక్త పరిస్థితి ఏనాటినుంచో ఏర్పడి ఉన్నది.

అగ్ర రాజ్యాలు జోక్యం కల్పించుకొనటం వల్ల ప్రస్తుత పోరాటం ఆగదన్నది అందరికీ స్పష్టమే. ఈ విషయంలో ఐక్య రాజ్య సమితి చేయగలిగినది కూడా ఏమీ లేదు. సమితి ఎదుర్కొనే చిక్కు ఏమిటంటే ఉత్తర వియత్నాం, కమ్యూనిస్టు చైనా దేశాలకు సమితిలో ప్రాతినిధ్యం లేదు. లావోస్‌లో పోరాటం నిలిచిపోవాలన్నా, తిరిగి అట్టి అలజడి ప్రారంభం కాకుండా ఉండాలన్నా, ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ చేసిన సూచనను అనుసరించటం వినా వేరొక మార్గాంతరం లేదు. జెనీవా ఒప్పందాన్ని అమలు పరచటం విషయంలో పర్యవేక్షణ బృందాన్ని కిగాను ఇండియా అధ్యక్షతన పనిచేసిన అంతర్జాతీయ కమిషన్ అమోఘంగా కృషి చేసి అందరి మెప్పు బడసినది. ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దటానికిగాను తిరిగి ఈ కమిషన్‌ను నియోగించాలని శ్రీ నెహ్రూ సూచించారు. ఉత్తర వియత్నాం రిపబ్లిక్ కూడా అంతర్జాతీయ కమిషన్ తిరిగి పని చెయ్యాలనే కోరుతున్నది. దీనికి పూనుకోవలసిందిగా కోరుతూ ఉత్తర వియత్నాం జెనీవా సమావేశానికి అధ్యక్షత వహించిన బ్రిటన్, రష్యా దేశాలకు టెలిగ్రాములు కూడా పంపినది. ఆ దేశాలు రెండూ ఇందుకు తగు చర్యలు తీసుకొనగలవని ఆశిద్దాం.

తృతీయ ప్రణాళిక ఎ.పి.సి.సి. ఉపసంఘాల చర్చలు సమాప్తం

న్యూఢిల్లీ, ఆగస్టు 11

తృతీయ ప్రణాళికకు సంబంధించిన విషయాలపై శ్రీ యు. ఎన్. ఢేబర్ అధ్యక్షతన ఎ.ఐ.సి.సి. ప్లానింగ్ సబ్ కమిటీ గత నాలుగు రోజులుగా సాగిస్తున్న చర్చలు నేటితో ముగిశాయి. తృతీయ ప్రణాళికపై గత జూన్‌లో ఊటీ సెమినార్‌లో సూచించబడిన పద్ధతుల ప్రకారం ప్రణాళిక సైజు, నిర్వహణ స్వరూపానికి సంబంధించిన విస్తృత లక్ష్యాలపై అంగీకారం కుదిరినది.

తృతీయ ప్రణాళికపై ముసాయిదా రిపోర్టును ఈ నెలాంతంలోగా సిద్ధంచేయటానికిగాను శ్రీ గుల్జారీలాల్ నందా శ్రీ సాదిక్ అలీ గార్లతో ప్లానింగ్ సబ్ కమిటీ ఒక డ్రాఫ్టింగ్ కమిటీని నియమించినది.

పంజాబ్‌లో వచ్చే నెలలో జరుగనున్న ఎ. ఐ. సి. సి. సమావేశంలో ఆ రిపోర్టు పరిశీలించ బడుతుంది. ముసాయిదా రిపోర్టుకు ప్రాతిపదికగా ఊటీ సెమినార్ సందర్భంలో వెలువరించబడిన ప్రకటనను ఉప సంఘం స్థూలంగా అంగీకరించినది. ద్వితీయ ప్రణాళికకు తర్వాత భాగంగా తృతీయ ప్రణాళిక కొనసాగాలనీ, ఇంతకుముందునిర్దేశితమైన విస్తృత లక్ష్యాలు ముందుకు గొనిపోబడాలనీ ఊటీ సెమినార్ ప్రకటనలో పదేపదే పేర్కొన బడినది. తృతీయ ప్రణాళిక పెట్టుబడి 10 వేల కోట్ల రూపాయల వరకు ఉండాలని కూడా ఆ ప్రకటనలో సూచించబడినది.

కమ్యూనిస్టు ప్రభుత్వం చర్యలపై విచారణ

కేరళ పి. ఎస్. పి. విజ్ఞప్తి

త్రివేంద్రం, ఆగస్టు 11

కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం గత 28 నెలల్లో సాగించిన "అవినీతికర, ప్రజాస్వామ్య విరుద్ధ" చర్యలపై విచారణ జరపాలని కేరళ ప్రజాసోషలిస్టు పార్టీ నేడు కోరినది.

ఈ కోరికను అంగీకరింప జేసేటందుకు ఒత్తిడి చేయటానికిగాను ఆగస్టు 23 వ తేదీనాడు రాష్ట్ర మంతటా "అవినీతి విచారణ దినం" జరపటానికి పార్టీ నిర్ణయించినది.

పాండిచేరి, ఆగస్టు 12

పాండిచేరి జనరల్ ఎన్నికల పట్ల రెక్కింపు ఆగస్టు 17 వ తేదీ నాడు జరగబోతుందని ప్రధాన ఎన్నికల అధికారి సి. చంద్రశేఖరన్ నేడు విలేఖరికి చెప్పారు.

యు. పి. కాంగ్రెస్ వ్యవహారాలు:

తిరుగుబాటు నాయకులకు సంజాయిషీ నోటీసులు

లక్నో, ఆగస్టు 11

యు.పి. కాంగ్రెస్‌లో తిరుగుబాటు వర్గానికి చెందిన ప్రముఖ నాయకులు ఆచార్య జుగల్ కిషోర్, శ్రీ మంగళా ప్రసాద్ గతశుక్రవారం నాడు అసెంబ్లీలో మంత్రి వర్గానికి వ్యతిరేకంగాచేసిన ప్రసంగాల గురించి సంజాయిషీ చెప్పుకోవాలని ముఖ్యమంత్రి డాక్టర్ సంపూర్ణానంద్ నేడు వారికి నోటీసులు ఇచ్చారు.

మాజీమంత్రి ఆచార్య జుగల్ కిషోర్ సంపూర్ణానంద్ మంత్రి వర్గం పట్ల తమకు విశ్వాసంలేదంటూ 98 మంది సభ్యులుచేసిన ఒక ప్రకటనను చదివి వినిపించారు. పార్టీ చీఫ్ విప్, యు.పి.సి.సి. కార్యదర్శులలో ఒకరు అయిన శ్రీ మంగళాప్రసాద్ ఆ ప్రకటనపై సంతకం చేసిన వారిలో ఒకరు.

పార్టీ సభ్యులు ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శించటం పార్టీ నిబంధనలకు విరుద్ధమని ఆగస్టు 19వ తేదీలోగా కమ ప్రవర్తనకు సంజాయిషీ చెప్పుకోవాలని వారికి తెలియజేయటం జరిగినది.

ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్‌లో విభేదాలను చర్చించటానికి ప్రదేశ్ కాంగ్రెస్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తిరుగుబాటు వర్గానికి చెందిన సభ్యులు నేడుకోరారు. సి. సి. సి. సమావేశం సెప్టెంబర్ మొదటి వారంలో ఏర్పాటు చేయాలని వారు కోరారు.

భిలాయ్‌లో రెండవ బొగ్గు కొలుముల శ్రేణి

న్యూఢిల్లీ, ఆగస్టు 12

1959 ఆగస్టు 15 వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం నాటి నుండి భిలాయ్ ఉక్కు కర్మాగారంలో రెండవ బొగ్గు కొలుముల శ్రేణిని వెచ్చ చేసే పని ప్రారంభమవుతుంది.

ఇవి పనిచేయడమంతా కూడా యీ వెచ్చ చేయడం మీదనే ఆధారపడి ఉంటుంది. ఒక సారి పని చేయడం ప్రారంభించినంటే యీ బాటరీ 1000 డిగ్రీల సెంటీగ్రేడు వరకూ వేడి ఎక్కుతుంది. అప్పటి నుండి రాతిని బొగ్గు ఉపయోగించి కోక్ అనే మెత్తని బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తారు.

ఇందులో మొదటి దాన్లో లాగే 65 కొలిములున్నాయి. వీటిల్లో రోజుకు 1000 టన్నుల కోక్ ఉత్పత్తవుతుంది.

భిలాయ్ ఉక్కు కర్మాగారంలో మూడు బొగ్గు కొలుముల శ్రేణులుంటాయి. ఇందులో మొదటిది 1958 అక్టోబర్ 25 వ తేదీని పని ప్రారంభించింది.

కళా ఖండాల కొనుగోళ్ల సంఘం సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

జాతీయ వస్తు ప్రదర్శనశాలకు కళా ఖండాల కొనుగోళ్ళ సంఘం సమావేశం మూడు రోజులపాటు సెప్టెంబర్ 7 వ తేదీ సోమవారం నుండి న్యూఢిల్లీ జనపథ్‌లోని జాతీయ ప్రదర్శన శాలలో జరుగుతుంది.

ఈ సంఘంవారు అమ్మకానికి వచ్చిన కళా ఖండాలన్నింటినీ పరీక్షించి వాటిలో ఉత్తమమైనవాటిని, పురాతన వస్తువులను, జాతీయప్రాముఖ్యం గల వస్తువులను, అపురూప ప్రాచీన చిత్ర కళా ఖండాలను, శిల్పాలు, వ్రాతప్రతులు, నేత వస్త్రాలూ, ప్రాచీన ఆయుధాలు, నాణాలు, నగలూ మొదలైనవాటిని కొంటారు. వీటిని న్యూఢిల్లీలోని జాతీయ వస్తు ప్రదర్శన శాలలో ఉంచుతారు.

ఈ కళా ఖండాలను పంపదలచిన వారు "అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, నేషనల్ మ్యూజియం, జనపథ్, న్యూఢిల్లీ" అన్న పేరునామారు 1959 ఆగస్టు 31 సోమవారం లోగా పంపాలి. వీరు తమ వస్తువులతోపాటు వాటికి సంబంధించిన వివరాలూ, ధరలూ అన్నీటినీ కూడా చేర్చి పంపాలి.

ఈ వస్తువులను పంపే దరఖాస్తుదారులు తమ ఖర్చుతో తపాలులోనైనా, లేక వారి ప్రతినిధుల ద్వారానైనా, లేక వారే స్వయంగానైనా, ఇంకా ఏ విధంగానైనా సరే పంపవచ్చు.

దేశంలో పత్తి ధరలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

1958-59 లోని అంచేప్రస్తుతపు ప్రత్తి ధరలనే 1959-60 లో కూడా నిర్ణయించినట్టు వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ వారు ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియ జేశారు. అయితే ఆ యా రకాలనుబట్టి బహు స్వల్పమైన మార్పులు ఉండవచ్చు. ఆమోదించబడిన ధరలూ కొత్త ధరవరల జాబితాలు త్వరలోనే ప్రకటించబడగలవని కూడా పత్రికా ప్రకటనలో పేర్కొన బడింది.

ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసుల ఉపసంహరణ

కేరళ ఆర్.ఎస్.పి. విజ్ఞప్తి

క్విలన్, ఆగస్టు 12

కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి జరిగిన ఉద్యమంలో పాల్గొన్నవారిపై పెట్టబడిన కేసులన్నీ ఉపసంహరించుకోవాలని కేరళ రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ నేడు తిరిగి కోరినది. పోలీసు కాల్పులపై, లాఠీఛార్జీలపై, ఇతర అత్యాచారాలపై ఇంకా విచారణ జరపనందుకు పార్టీ తీవ్ర ఆందోళన ప్రకటించినది.

మున్నార్ పోలీసు కాల్పులు న్యాయసమ్మతమే

జిల్లా జడ్జి అభిప్రాయం

త్రివేంద్రం, ఆగస్టు 10

కేరళలోకమ్యూనిస్టుపార్టీప్రభుత్వంఅధికారంలో ఉండగా గత అక్టోబర్ నెలలో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన కార్మిక సమ్మె సందర్భంగా మున్నార్‌లో జరిగిన పోలీసు కాల్పులు న్యాయసమ్మతమైనవేనని ఆ కాల్పులపై విచారణ జరిపిన జిల్లా జడ్జి శ్రీ పి.యు. కురైకోస్ అభిప్రాయపడినట్టు అధికార వర్గాల ద్వారా నేడెక్కడ తెలిసినది.

శ్రీ కురైకోస్ తమ నివేదికను ప్రభుత్వానికి గత వారం సమర్పించారు. ప్రభుత్వం ఇప్పుడు దానిపై పరిశీలనలు జరుపుతున్నది.

ఆ సమ్మె సమయంలో మొత్తం మూడు చోట్ల కాల్పులు జరిగినవి. నెట్టికుడిలో అక్టోబర్ 15 నాడు, గుడ్రాలి, తలయార్‌లలో అక్టోబర్ 20 నాడు కాల్పులు జరిగాయి. కాల్పులలో ఇద్దరు మరణించారు.

ఈ కాల్పులలో పోలీసులు యజమానుల పట్ల పక్షపాతం చూపించారని కేరళ కమ్యూనిస్టు పార్టీ ఆరోపించినది.

హోటళ్ల పరిశ్రమ

పరిశీలన సంఘం సిఫార్సులపై ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 12

హోటళ్ల పరిశ్రమను మొత్తంమీద ప్రైవేటు రంగానికే వదలి వేయాలనీ, అయితే ప్రైవేటురంగం బాధ్యతను నిర్వహించ లేకపోయినా, స్వీకరించడానికి సుముఖంగా లేక పోయిన సందర్భంలో ప్రభుత్వం నిర్వహించాలనీ హోటళ్ల ప్రమాణాలు, రేట్ల పరిశీలన సంఘం చేసిన సిఫార్సును భారత ప్రభుత్వం ఆమోదించింది. ఆసంఘం చేసిన ముఖ్య సిఫార్సులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తీర్మాన రూపంలో వెల్లడించారు.

హోటళ్ల వర్గీకరణ

విదేశ యాత్రీకులకు వినియోగపడే హోటళ్లను అంతర్జాతీయంగా వాడుకలోవున్న స్టార్ పద్ధతి క్రింద వర్గీకరిస్తారు. భారత దేశంలో హోటళ్లను పైపద్ధతి క్రింద అయిదు రకాలుగా వర్గీకరించాలనీ, వర్గీకరణ అమలులోకివచ్చే ముందు హోటళ్ల ప్రమాణాలను పెంపొందించ డానికి హోటళ్ల యజమానులకు తగిన వ్యవధి యివ్వాలనీ ఆసంఘం సిఫార్సు చేసింది. హోటళ్లకు తగిన వ్యవధి యివ్వడానికి 1960 జూన్ నాటికి ముగ్గురు సభ్యులతో హోటళ్ల వర్గీకరణ సంఘాన్ని నెలకొల్పుతామనీ, ఆ సంఘం 1960 ఆఖరు నాటికి హోటళ్ల తనికీ, వర్గీకరణ కలాపాలను పూర్తి చేయగలదనీ ప్రభుత్వం నిర్ణయించింది.

ఆర్థిక సహాయం

హోటళ్ల పరిశ్రమకు పంచవర్ష ప్రణాళికలో స్థానంయిచ్చి ప్రభుత్వ కార్పొరేషన్లు, బ్యాంకులు వారికి ఆర్థిక సహాయం చేయాలనీ, అవసరమైన హోటళ్ల యజమానులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం 10 కోట్ల రూపాయల నిధిని నెలకొల్పాలనీ ఆ సంఘం సిఫార్సు చేసింది. హోటళ్ళ పరిశ్రమ విదేశ మారకపు ద్రవ్యాన్ని ఆర్జించడంలో నేమి, యాత్రిక పరిశ్రమను అభివృద్ధి చేయడానికేమి విశేషంగా తోడ్పడుతుంది కాబట్టి కొత్త హోటళ్ళను స్థాపించడానికీ, వున్న హోటళ్ళ ప్రమాణాలను పెంపొందించడానికీ ఋణాల రూపంలో ధన సహాయం చేయాలని ప్రభుత్వం భావించి పార్లమెంటు చట్టం ద్వారా నెలకొల్పిన ఆర్థిక సహాయ సంస్థల నుంచీ, యితర ఋణ సహాయక సంస్థల నుంచీ ఋణ సహాయం పొందడానికి చర్యలు తీసుకోగలదనీ, ప్రభుత్వం ప్రత్యేక నిధిని నెలకొల్పడం యిప్పుడే సాధ్యం కాదనీ నిర్ణయించింది.

విదేశ పెట్టుబడులు

హోటళ్ళను నెలకొల్పడంలో విదేశ సహాయాన్ని పొందడం వల్ల ప్రయోజనాలున్నాయన్న సందర్భాలలో మొత్తం పెట్టుబడిలో విదేశ పెట్టుబడి నూటికి 49 వంతులు మించని పక్షంలో అట్టి భాగ స్వామ్యాన్ని ప్రభుత్వం అంగీకరిస్తుందనీ, అయితే ప్రతి సందర్భాన్నీ ప్రభుత్వం దానిని యోగ్యత యోగ్యతలను పరిశీలిస్తుందనీ ప్రభుత్వం నిర్ణయించింది.

మద్య నిషేధం

మద్య నిషేధం విషయంలో విదేశ యాత్రీకుల మద్యపాన అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం శాయశక్తులా కృషి చేయగలదనీ, ప్రభుత్వ మద్య నిషేధ విధానం రాష్ట్రాలలోని మద్య నిషేధ చట్టాలకు లోబడి సహేతుకమైన అవసరాలకు మద్య పానం అనుమతించబడుతోంది. ఇక ముందు కూడా అనుమతించబడుతుంది.

రేట్లపై కంట్రోల్

హోటళ్ళ రేట్ల విషయంలో ప్రస్తుతం బొంబాయిలోనూ, యితరచోట్లావున్న వాటిని వుపసంహరించాలనీ, ఆ దృష్ట్యా అందుకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు సవరించాలనీ కేంద్ర ప్రభుత్వం కోరింది. హుబ్బాల్లీ సిద్ధాంతం దృష్ట్యా స్థానిక పరిస్థితుల కనుగుణ్యంగా కొలది మార్పులతో హోటళ్ళలో రేట్లను నిర్ణయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దిగుమతి సౌకర్యాలు

హోటళ్ళు సక్రమమైన ప్రమాణాలను నిలబెట్టి నిర్వహించడానికి, అవసరసామగ్రిని పొందడానికి, నేరుగా దిగుమతి చేసుకునేందుకు లైసెన్సులు యివ్వాలనీ, ఎక్కువ మంది యాత్రీకులను ఆకర్షించడానికి ప్రైవేటు, ప్రభుత్వ హోటళ్ళలోని గదులలో ఎయిర్ కండిషనింగ్ సౌకర్యాలను నెలకొల్పాలనీ, ఆ పరికరాల దిగుమతికి ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలనీ ఆ సంఘం సిఫార్సు చేసింది. ప్రభుత్వం ఆ సిఫార్సును ఆమోదించింది. హోటళ్ళ పరిశ్రమకు అట్టి సౌకర్యాన్ని యిదివరకటి

(మిగతా శివ పేజీలో)

కొన్నె పాఠశాల స్థితి

ఆర్యా!

జనగామ తాలూకా నర్సాయపల్లి గ్రామంలో ఇద్దరు ఉపాధ్యాయులు కల పాఠశాలల కలదు. ఈ సంవత్సరం వేసవి సెలవుల అనంతరం జూన్ 8 వ తేదీన తెరువవలసిన పాఠశాల నేటి వరకు తెరువలేదు. ఈ విషయాన్ని గూర్చి గ్రామీణులు విద్యాశాఖాధికారులకు పరభాస్తు పంపుకొన్నారు. కాని నేటి వరకు ఉపాధ్యాయులు వచ్చి పాఠశాల తెరువలేదు. ఇది చాలా శోచనీయం. నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇంకటి ఘోరమైన విషయం జరగటం పాలక వర్గానికే తలవంపు గనుక విద్యాశాఖ మంత్రిగారుఈవిషయంలోవెంటనే తగుచర్యగైకొనాలనిపత్రికా ముఖంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎస్. అమృత రావు, కొన్నె.

ఆదోని పట్టణంలో ప్రజావసరాలు

ప్రభుత్వ వైఖరి పట్ల వర్తకుల ఆక్షేపణ

ఆదోని, ఆగస్టు 11

పట్టణంలో ప్రజావసరాలు తీరేటంత వరకు ప్రభుత్వం రుణ సేకరణలో సహకరించ రాదని ఆదోని బట్టల వర్తకుల సంఘం గత 8 వ తేదీన తీర్మానించినది.

పట్టణానికి నీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, డ్రైనేజ్, సౌకర్యం మొదలైన విషయాలలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నందుకు సంఘం ఆందోళన వ్యక్తం చేసినది.

నల్ల చెరువులో నీరు వట్టి పోవటం వల్ల మరో విధంగా పట్టణానికి సరఫరా చేయాలని ప్రభుత్వానికి సంఘం విజ్ఞప్తి చేసినది.

ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్నందున ఆదోని పట్టణాన్ని నిర్లక్ష్యంచేయటం బాధాకరంగా ఉన్నదని సంఘం తీర్మానంలో పేర్కొన్నది.

ఆదోని పట్టణం జనాభా 80 వేలకు పైగా ఉన్నది.

వరద నిరోధక పథకాలకు అదనంగా 7 కోట్ల రూపాయలు మంజూరు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరమైన వరద నిరోధక పథకాలు మరి కొన్నింటిని అమలు జరపటానికి గాను కేంద్ర ప్రభుత్వం రెండవ పంచవర్ష ప్రణాళికలో అదనంగా ఏడు కోట్ల రూపాయలను కేటాయించినది.

వరద నిరోధక కార్యక్రమాల కోసం రెండవ ప్రణాళికలో మొదట 49 కోట్ల రూపాయలు మాత్రమే మంజూరు చేసారు. ఇప్పుడీ మొత్తాన్ని 56 కోట్లకు పెంచారు.

నేడు లోక్‌సభలో శ్రీమతి ఇలా పాల్ చౌదరి ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా ఇరిగేషన్ ఉప మంత్రి శ్రీ హాథీ పై విషయాన్ని తెలియజేసారు.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 10

హిందీలో ఉన్నత విద్యాభ్యాసం సాగించడానికి హిందీ మాతృభాషకాని విద్యార్థులకు 1958-59లో 110 భారత ప్రభుత్వ స్కాలర్‌షిప్పులిచ్చారు వీటిలో ఆంధ్ర ప్రదేశ్‌కు 29, మద్రాసుకు 25, కేరళకు 24, మైసూరుకు 13, బొంబాయికి 5, అస్సాంకు 4, పంజాబుకు 3, ఒరిస్సాకు 2, పశ్చిమబెంగాలుకు 1, మణిపూరుకు 1 వచ్చాయి.

ఈవారం లోక్‌సభలో శ్రీ వి. సి. మల్లన్ అడిగినప్రశ్నకులిఖితపూర్వకంగా సమాధానం చెబుతూ కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కె. ఎల్. శ్రీమాలి పైవిషయం తెలియజేసారు.

భాషల, నేపాలు దేశాల మధ్య యిప్పుడు అమలులో వున్న 1950 జూలై 31 నాటి ఒప్పందాన్ని 10వ అధ్యాయం క్రింద రద్దు చేస్తామని నేపాలు ప్రభుత్వం తెలియ జేశారు. పాత ఒప్పందం రద్దుకూ, కొత్త ఒప్పందం అమలుకూమధ్య కాలహరణం లేకుండా చూసేందుకు తగిన సమయంలో కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని తమ వాంఛ అని కూడా వారు వ్యక్తపరిచారు. కొత్త ఒప్పందాన్ని గురించి సంప్రదింపులు జరుగుతున్నాయి.

లోక్‌సభలో ఈ రోజున శ్రీ వాజ్‌పాయి మరి ముగ్గురూ అడిగిన ప్రశ్నకు సవధానంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉప మంత్రి శ్రీ బి. ఆర్. భగత్ పై విషయం తెలియ జేశారు.

భారత దేశంలోని క్రైస్తవ మిషనరీలకు యీ సంవత్సరం మొదటినాలుగు నెలలలోనూ విదేశాల నుంచి రు. 370.2 లక్షలు అందింది.

దేశాలవారీగా యీ విరాళాల వివరాలివి: యునైటెడ్ కింగ్‌డమ్—రు. 68.3 లక్షలు, మలయా—రు. 0.3 లక్షలు, స్టెర్లింగ్ ప్రాంతంలోని యితర దేశాలు—రు. 1.4 లక్షలు, యునైటెడ్ స్టేట్స్—రు. 264.2 లక్షలు, కెనడా—రు. 11.6 లక్షలు, డాలర్ ప్రాంతంలోని యితర దేశాలు—రు. 0.1 లక్షలు, పశ్చిమ జర్మనీ—రు. 7.9 లక్షలు, స్విట్జర్లాండు—రు. 1.6 లక్షలు, ఒ.ఇ.ఇ.సి. ప్రాంతం—రు. 14.6 లక్షలు, నాన్ స్టెర్లింగ్ ప్రాంతంలోని యితర దేశాలు—రు. 0.2 లక్షలు.

శ్రీ జి. కె. గోపాలన్, శ్రీ మంహన్ అడిగిన ప్రశ్నకులిఖిత పూర్వకంగా సమాధానం చెబుతూ, దేశీయాంగ మంత్రి శ్రీ జి. బి. పంత్ పై వివరాలిచ్చారు.

మిషనరీలకు విదేశాలు పంపే సొమ్ముపై ప్రభుత్వం నిర్బంధ విధించిందా? అని శ్రీ నారాయణన్ కుట్టిమేనన్, శ్రీ పున్నూస్ అడిగిన ప్రశ్నకు దేశీయాంగ మంత్రి "లేద"ని జవాబు చెప్పారు.

దామన్‌లో నీగ్రో జాతి సైనికుల దుస్థితి

వాపి (సూరత్ జిల్లా), ఆగస్టు 12

పోర్చుగీస్ ఆక్రమిత దామన్ ప్రాంతంనుంచి ఇటీవల నీగ్రో సైనికు డొకడు భారత భూభాగంలోకి ప్రవేశించాడు.

పోర్చుగీస్ పాలకులు నల్ల జాతివారి పట్లసాగిస్తున్న అత్యాచారాలను భరించలేక తాను భారతదేశంలో ప్రవేశించినట్టు అతడు ప్రకటించాడు. నీగ్రో సైనికునిపేరు జుజార్.

తెల్లజాతి సైనికులవేతనాలు, ఉద్యోగ స్థితిగతులు చాలా మెరుగుగా ఉన్నాయనీ, శ్వేతేతరులు దుస్థితి చెప్పనలవి కాదనీ అతడు తెలియజేసాడు. తనకు ఉచితంగా తిండినిచ్చి నెలకు పది రూపాయల జీతమిస్తున్నారనీ, రోజుకు 18 గంటలసేపు పనిచేయిస్తారనీ, అకారణంగా శ్వేతజాతి అధికారి ఒకరు తనపై దౌర్జన్యం చేసాడనీ అతను తెలియజేసాడు.

పోర్చుగీస్ భూభాగంలోకి మళ్లీ అడుగుపెట్టలేననీ, ఇక్కడే ఏదైనా ఉద్యోగం చూసుకుంటానని జుజార్ ప్రకటించాడు.

యూనివర్శిటీలలో బోధనా భాష

ప్రభుత్వవైఖరిపై రాజ్యసభలో విమర్శలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12

అధికార భాషా సమస్యపై పార్లమెంటు చర్చజరపక ముందే యూనివర్శిటీలలో బోధనాభాషగురించి కుంజ్రూ కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అంగీకరించినందుకు నేడు రాజ్యసభలో తీవ్రవిమర్శలు చేయబడ్డాయి.

శ్రీ దేవకీనందన నారాయణ్ ప్రశ్నకు సమాధానమిస్తూ విద్యామంత్రి డాక్టర్ కె. ఎల్. శ్రీ మాలి యూనివర్శిటీ స్థాయిలో ఇంగ్లీషు స్థానాన్ని గురించి కుంజ్రూ కమిటీచేసిన ముఖ్య సిఫార్సులు ప్రభుత్వం అంగీకారాన్ని పొందినట్లేనని అన్నారు.

యూనివర్శిటీలలో విద్యాబోధన ప్రాంతీయ భాషలలోనే జరగాలని రాధాకృష్ణ కమిషన్ చేసిన సిఫార్సును ప్రభుత్వం ఇదివరకే అంగీకరించినదని శ్రీ శ్రీ మాలి అన్నారు. ఇంగ్లీషు స్థానంలో ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టే ముందు తగు సన్నాహాలన్నీ జరపాలనిమాత్రమేకుంజ్రూకమిటీ సిఫార్సు చేసినది. ప్రభుత్వం దీనితో ఏకీభవించినదని, అవసరమైనంత సన్నాహాలు జరుపుతున్నదని ఆయన అన్నారు.

శ్రీ బి. కె. సి. సిన్హా మాట్లాడుతూ అధికార భాషాకమిటీ నివేదికపై పార్లమెంటు చర్చ జరపకముందే, ఈ విషయంపై రాష్ట్రపతి జారీచేయవలసిన ఉత్తర్వులు జారీచేయకముందే ప్రభుత్వం కుంజ్రూకమిటీ సిఫార్సులను అంగీకరించటం అసమంజసం కాదా అని ప్రశ్నించారు.

ఆ ప్రశ్నే ఉద్భవించదని డాక్టర్ శ్రీ మాలిఅన్నాడు.

అయినప్పటికీ శ్రీ సిన్హా తన ప్రశ్నను మరోసారివేసి, కుంజ్రూ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించటంతో ఇంగ్లీషుకు అదనపు అధికార భాషగా చాలా ప్రముఖ స్థానం లభిస్తున్నదని, ఇంగ్లీషుపట్ల అనవసరపు అభిమానం చూపినట్లవుతుందని ప్రభుత్వం గుర్తించినదా అని ప్రశ్నించారు.

శ్రీ శ్రీ మాలి సమాధానమిస్తూ బోధనాభాషగా ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టాలని యూనివర్శిటీ కమిషన్ చేసిన సిఫార్సును ప్రభుత్వం ఇదివరకేఅంగీకరించినదని, కుంజ్రూ కమిటీ సిఫార్సు చేసిందల్లా ఇంగ్లీషును తొలగించే ముందు తగు సన్నాహాలు చేయాలన్నదేనని అన్నారు.

రాధాకృష్ణ కమిషన్ సిఫార్సు చేసినప్పటికీ ప్రభుత్వం ఈ విషయం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఇంగ్లీషుస్థానంలో ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరగటం లేదని శ్రీ భూపేష్‌గుప్త అన్నారు. దీనికి ఒక కారణం ఇంగ్లీషుకు అనవసర ప్రాముఖ్యం ఇవ్వట మేనని కూడా అన్నారు.

శ్రీ శ్రీ మాలి సమాధాన మిస్తూ ప్రభుత్వం ఆనివేదికను అమలు ప

మనిలా, ఆగస్టు 11.
ఇక్కడికి సుమారు 400 మైళ్ల దూరంలో ఉన్న ఐలోకోస్ సర్ రాష్ట్రంలో రాజకీయ హత్యలకు బాధ్యులైన 11 మందిని అరెస్టు చేయటానికి ఫిలిప్పీన్స్ ప్రభుత్వ దళాలు అన్వేషణ ప్రారంభించాయి.

పిఠాపురం శాసన సభ్యులు
శ్రీ వి. గోపాలకృష్ణ
ఈ విధంగా వ్రాస్తున్నారు:
"హైదరాబాద్ నిజాంపాలిహిల్స్ రోడ్‌లో ఉన్న కంటివైద్యులు డాక్టర్ లుఖ్మాన్ గారి షోరూములను (జనతా ఆప్టిష్యన్స్) సందర్శించే అవకాశం నాకు కలగింది. వారిచే నా కండ్లను పరీక్ష చేయించుకొని, సులోచనాలను తీసుకున్నాను. అవి చాలా సంతృప్తి నిచ్చాయి. మూడు తరాల హైద్రాబాద్ ప్రజల సేవచేసిన ఒక వృద్ధ నేత్ర నిపుణునితో డాక్టర్ గారికిసంబంధమున్నట్లు నా హైద్రాబాద్ మిత్రుల ద్వారా తెలిసింది. ఆంధ్ర ప్రదేశ్‌కు ఒక దివ్యమణి ఆంధ్ర ప్రదేశ్ కంఠకూసేవచేయడంలో వీరు జయశీలు రగుదురని ఆశిస్తున్నాను."

4వ మహత్తర వారం!
ప్రత్యేక ఆకర్షణ
మీరు ఇతని విషయమై ఇదివరలో చాలా చదివి యుంటారు.
ఇతనిచే కూర్చబడిన సంగీతం విని యుంటారు.
ఇప్పుడు
మహాలక్ష్మి పిక్చర్స్ వారి
"అజ్ - కా - గీత్"
రెండు రీల్స్‌లో
ఓ. పి. సయ్యర్‌ను
ప్రథమముగా వెండితెర మీద ఇతనిని చూడండి.

రూపాలయ వారి
హీరా మోతి
నిరూపరాయ్, బలరాజ్ సాహనీ, శుభాఖోటే, బైజ్‌శర్మ, పి. కైలాశ్, ఆశిమ్‌కుమార్, కుక్కూ, హెలెన్. బేబీనాజ్
అశోక్ మనోహర్
హైదరాబాద్ సికిందరాబాద్
ఆటల సమయాలు: 6-30, 9-30.
— విజయ రిలీజ్ —
(Trupix)

అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు:

అధికార భాష కమిషన్ నివేదిక తెలుగు ప్రతులు

హైదరాబాద్, ఆగస్టు 12
అధికార భాషా కమిషన్ నివేదిక తెలుగు తర్జుమాను త్వరలోనే ప్రకటిస్తారని ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు నేడు అసెంబ్లీలో వెల్లడించారు.

కమిషన్ నివేదికను కేంద్ర ప్రభుత్వం వివిధ భారతీయ భాషలలోకి తర్జుమా చేయిస్తున్నదని ఆయన శ్రీ బి. శ్రీరామమూర్తి (ఎస్.డి.సి.) ప్రశ్నకు సమాధానంలో తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగులో తర్జుమా చేసి ప్రచురిస్తారు.

గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వోద్యోగుల అవినీతి నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తున్నదనీ. సాధ్యమైనంత-త్వరలోనే సమాచారాన్ని సభలో సమర్పించగలమనీ ముఖ్యమంత్రి అదే సభ్యుని మరో ప్రశ్నకు సమాధాన మిచ్చారు.

ఆరులక్షల రూపాయలు నష్టం సంభవించిన ఫలితంగా హైదరాబాద్ టాకీస్ లిమిటెడ్ రద్దయినదని శ్రీ కాశిరెడ్డి (కమ్యూనిస్టు) ప్రశ్నకు ముఖ్య మంత్రి సమాధానమిచ్చారు. కంపెనీ 12, 85, 714 రూపాయల మూలధనం. 7, 95, 979 రూపాయల చెల్లింపు పెటుబడి ఉండేదనీ, అందులో ప్రభుత్వ పెట్టుబడి ఆరు లక్షల వరకు ఉండేదనీ, గత సంవత్సరం సెప్టెంబర్ 9 వ తేదీన కంపెనీ రద్దయినదనీ,రద్దు వ్యవహారాల పరిష్కారానికి లిక్విడేటర్‌ను నియమించారనీ ఆయన తెలియ జేసారు. పెట్టుబడి మొత్తాన్ని సాధ్యమైనంత వరకు రాబట్టుకొనటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన స్పష్టం చేసారు.

ఉద్యోగులపట్ల వివక్షత లేదు

"క్విట్ వర్క్ డే" సమ్మెలో పాల్గొనని ఉద్యోగులకు ఒకఇంక్రిమెంటు మంజూరు చేయడంవల్ల ఆంధ్ర తెలంగాణా ఉద్యోగులపట్ల వివక్షతచూపించినట్టు కాలేదని ముఖ్యమంత్రి వివరించారు.

శ్రీ ఎస్. జగన్నాథం (ఎస్. డి. పి.) ప్రశ్నకు సమాధానంలో ఆయన పై విధంగా వివరించారు. "క్విట్ వర్క్ డే" సమ్మెలో పాల్గొనని ఉద్యోగులలో ఆంధ్ర ప్రాంతానికి చెందినవారు కూడా చాలామంది ఉన్నారనీ, అలాగే తెలంగాణా ప్రాంతీయులు కొందరు సమ్మెలో పాల్గొన్న ఫలితంగా వారికి ఇంక్రిమెంట్లు రాలేదనీ ఆయన తెలియజేసారు.

మైనర్ ఇరిగేషన్ పనులు

గత సంవత్సరం మైనర్ ఇరిగేషన్ పనులకుగాను 64,96,248 రూపాయలు ఖర్చయినదని రెవెన్యూ మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారు ఒక ప్రశ్నకు సమాధానంలో వెల్లడించారు. ఆంధ్ర ప్రాంతంలో చెరువుల పునరుద్ధరణకోసం, ప్రణాళికలో కేటాయించిన మొత్తం నుంచి 3, 55, 345 రూపాయలు ఖర్చయినదని కూడా ఆయన తెలియజేసారు.

మత్తు పదార్థాలపై నిషేధం

అఖిల భారత మత్తు పదార్థ వ్యవహారాల మహా సభ సిఫార్సుల ప్రకారం వైద్యానికి తప్పించి ఇతరత్రా ఉపయోగం కోసం ఆబ్కారీ దుకాణాల ద్వారా నల్లమందు పంపిణీ నిషేధించినట్టు కార్మిక మంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు ఒక ప్రశ్నకు జవాబు చెప్పారు. గత ఏప్రిల్ నెల నుంచి తెలంగాణాలో పై నిషేధం అమలు జరిగింది. అలవాటుపడి మెడికల్ సర్టిఫికేట్‌తో రిజిస్టర్ చేసుకొన్నవారికి మట్టుకు నెలకు నాలుగు తులాలకు మించకుండా నల్లమందు సప్లయి జరుగుతుందని ఆయన తెలియజేసారు.

సల్లకుంటకు రోడ్డు

హైదరాబాద్‌కు మార్పు దిశగా ఉన్న సల్లకుంట పొరుగు మట్టి రోడ్డు, విధి దీపాలు వేయించాలని దరఖాస్తు పెట్టుకొన్న మాట నిజమేనని శ్రీమతి కమలాదేవి, శ్రీ ధర్మభిక్షం గార్ల స్వల్ప వ్యవధి ప్రశ్నకు కార్మిక మంత్రి సమాధానమిచ్చారు.

దరఖాస్తును తాము నగర కార్పొరేషన్ మేయర్‌కు పంపినట్టు కూడా ఆయన వెల్లడించారు.

అసెంబ్లీలో స్వతంత్ర పార్టీ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, ఆగస్టు 11
పంచాయతీలుగాని, పట్టణ పాలన సంఘాలుగాని విధించే పన్నులపై సర్ ఛార్జి విధించటానికి పంచాయతీ సమితులకు అధికారమిచ్చే అంశాన్ని పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల బిల్లులో చేర్చి నందుకు ఆక్షేపణగా నేడు అసెంబ్లీ నుంచి స్వతంత్రపార్టీ సభ్యులు వాకౌట్ చేసారు.

పై అంశానికి అనుకూలంగా 64 ఓట్లు, ప్రతికూలంగా 38 ఓట్లు వచ్చాయి,

అసెంబ్లీలో స్వతంత్ర పార్టీ సభ్యుల సంఖ్య ఆరు అయితే వాకౌట్ జరిగినప్పుడు ఇద్దరే సభలో వున్నారు.

అంతకు ముందు కమ్యూనిస్టులు మరికొందరు వాకౌట్ చేసి నప్పుడు వీరు కూడా వారితో కలసి వాకౌట్ చేసారు.

హరిదాసుకు సన్మానం

సికింద్రాబాద్, అగస్టు 12
ప్రముఖ హరికథా భాగవతారు శ్రీ పిల్లలమర్రి రామదాసు గారికి ఇటీవల ఇక్కడ ఘన సన్మానం జరిగినది.

ఆయనలోక కళ్యాణార్థం 109 పర్యాయాలు రామాయణాన్ని హరికథా రూపంలో గానంచేసారు.

సికింద్రాబాద్‌లో హరికథా గానం సందర్భంలో శ్రీ నాగెల్లి దుర్గయ్య, శ్రీ దేవులపల్లి సుబ్రహ్మణ్య సిద్ధాంతి గార్లు సీతాకళ్యాణ మహోత్సవాన్ని, శ్రీ జంగిడి పెంటయ్యగారు శ్రీరామ పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని, శ్రీ జంగిడి బాలయ్యగారు సుగ్రీవ పట్టాభిషేకాన్ని, శ్రీ ఈదర వెంకటాపురంగారు విభీషణ పట్టాభిషేకాన్ని, శ్రీ బూరుగు మహాదేవ్‌గారు రామరాజ్య పట్టాభిషేకాన్ని జరిపించారు. శ్రీ భాగవతార్ గారికి 200రూపాయలు, ఉంగరం, వస్త్రాలను సమర్పించి సత్కరించారు.

సన్మాన సభకు అడ్వకేట్ జనరల్ శ్రీ డి. నరసరాజుగారు అధ్యక్షత వహించారు.

కరీంనగరంలో ద్విసహస్రావధానం

కరీంనగర్, ఆగస్టు 12
ఉభయభాషా ప్రవీణ శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు గత ఆదివారం నాడు ఇక్కడ బహుళార్థసాధకోన్నత పాఠశాలలో ద్విసహస్రావధానంచేసారు "జయంతి" పత్రిక సంపాదకవర్గ సభ్యులు శ్రీ జువ్వాడి గౌతమరావుగారు సభకు అధ్యక్షత వహించారు. అవధాన కార్యక్రమంమూడు గంటలసేపు జరిగినది.

పురప్రముఖులు పెక్కుమంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో యువజన కాంగ్రెస్ దినోత్సవం

నిజామాబాద్, ఆగస్టు 10
నిన్నటి దినం నాల్గవ యువజన కాంగ్రెస్ దినోత్సవం జరిగినది. ఉదయం పట్టణ వీధులలో ప్రభాతభేరీ జరిగినది.

జిల్లాకాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కె.వి. గంగాధర్ పతాకావిష్కరణోత్సవం చేసారు. ఆటల పోటీలకు పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ ఎ.కిషన్‌దాస్ ప్రారంభోత్సవం చేశారు. హిందీ, తెలుగు భాషలలో వక్తృత్వ పోటీలు జరిగాయి.విజేతలకు శాసన సభ్యుడు శ్రీ దావర్ హుస్సేన్ బహుమతులను పంచిపెట్టారు.

సిడ్నీ, ఆగస్టు 11
సాయుధుడై ముసుగు వేసుకొని వచ్చిన ఒక దొంగ నేటి దినం ఇక్కడ ఒక బ్యాంకులో ప్రవేశించి ఒక ఉద్యోగిని హడలకొట్టి 820 పౌండ్లు ఎత్తుకు పోయాడు.

రాజధాని వార్తలు

స్వాతంత్ర్యదినోత్సవాల సందర్భంగా ఫతేమైదానంలో మాజీ సైనికుల సంఘం ఒక ర్యాలీ ఏర్పాటు చేస్తున్నది. మాజీ సైనికులు, అధికారులు, విద్యార్థులు సభలో పాల్గొనవచ్చు.

* * *

వై. ఎమ్. సి. ఎ. వచ్చే 14 వ తేదీన ఒక సైకిల్ పోటీని ఏర్పాటు చేస్తున్నది పోటీలో పాల్గొన దలచినవారు వై.ఎమ్. సి. ఎ. కార్యదర్శి శ్రీ చిన్నదొరైను సంప్రదించవచ్చు. శాసన సభ్యుడు శ్రీ కొత్తూరు సీతయ్య గుప్తగారు బహుమతి ప్రదానం చేస్తారు.

* * *

స్మాల్ కాజెస్ కోర్టులోని బార్ అసోసియేషన్ రూమ్‌లో జంట నగరాల న్యాయవాదుల సమావేశం జరిగినది. కొత్త రెంట్ కంట్రోల్ బిల్లుపై సమావేశం చర్చ జరిపినది. బిల్లుపట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసినది ఈ విషయంలో తగు చర్యలు తీసుకొనటానికిగాను పది మంది సభ్యులతో ఒక ఉప సంఘాన్ని నియమించారు.

* * *

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15 వ తేదీన ఉదయం 7-30 గంటలకు గాంధీ భవనం వద్ద ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ పిడతల రంగారెడ్డిగారు పతాకావిష్కరణోత్సవం జరుపుతారు.

* * *

ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యం చేసినట్టు ప్రముఖ వర్తకుడు శ్రీ పోకర్ మల్ గుప్తపై మంగళవారంనాడు నాల్గవ సిటీ మేజస్ట్రేట్ కోర్టులో పోలీసులు ఛార్జి షీట్ దాఖలు చేసారు.

* * *

బోలక్‌పూర్‌లోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడొకరు క్లాసులో పాఠం చెబుతుండగా కొందరు ఆయనపై దౌర్జన్యం చేసారు. ఒక పిల్లవాడు తప్పు చేసినందుకు ఉపాధ్యాయుడు దండించాడనీ, ఉపాధ్యాయుని ప్రవర్తనకు ఆగ్రహావేశ పరులైన పిల్లల తల్లిదండ్రులు ఆయనపై దౌర్జన్యం చేసారనీ తెలుస్తున్నది. ఉపాధ్యాయునిపై దౌర్జన్యానికి ఆక్షేపణగా కొంతకాలం పాఠశాలను మూసివేయాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయుల సంఘం డి. వి. ఐ. కి విజ్ఞప్తి చేసారు,

* * *

బీరార్ యువరాజుకు గాని, నవాబ్ మొఐజాహి బహదూర్‌కు గాని పౌరులెవ్వరూ అప్పు ఇవ్వరాదనీ, ఒకవేళ ఇస్తే వారి స్వంత బాధ్యతపైన ఇవ్వవలసి ఉంటుందనీ నిజాం నవాబు స్థానిక ఉర్దూ పత్రికలో వ్రాసారు. మారిన పరిస్థితుల దృష్ట్యా తన కొడుకులకు అప్పు లివ్వరాదని ఆయన వ్రాసారు.

* * *

సుల్తాన్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎమ్.ఎస్. నాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నరసింహారెడ్డి, అఫ్‌జల్‌గంజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కృష్ణారెడ్డి గార్లు మంగళవారం రాత్రి మహారాజ్‌గంజ్‌లోని ఒక జూద గృహంపై దాడి చేసారు. జూదగృహాన్ని శామ్‌లాల్ అను వ్యక్తి నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. పోలీసులు ఈ సందర్భంలో నలుగురిని అరెస్టు చేసారు.

మద్య నిషేధ సమస్య

సర్వోదయ మండలిచే చర్చా గోష్ఠి ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 11
శ్రీ ఉమ్మెత్తల కేశవరావుగారు ఇలా వ్రాస్తున్నారు: మద్య పానం, మద్య నిషేధము సాంఘికంగా, ఆర్థికంగా మన దేశానికి, సమాజానికి పెద్ద చిక్కు సమస్యలై పోయినవి. తెలంగాణా ప్రాంతంలో మద్య నిషేధం అమలు పరచటాన్ని గురించి విన్నాభిప్రాయాలున్నాయి. ఈ విన్నాభిప్రాయాలను సమన్వయ దృష్టిలో పరిశీలించడం ఉచితమని సర్వోదయ మండలిలో నిర్ణయించుకొన్నాం. కొందరు మిత్రులు శాసన సభ్యులు ఈ సమస్యను చర్చించటం అవసరమని తెలిపారు. ఇందుకుగాను ఆగస్టు 13 వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు గాంధీభవనంలోని సర్వోదయ మండలి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయబడినది.

పాపన్నపేట పాఠశాల భవననిర్మాణానికి పౌరుల కృషి

పాపన్నపేట, ఆగస్టు 10
పాపన్నపేట గ్రామంలో పాఠశాల భవనాన్ని నిర్మించే విషయమై గత శుక్రవారం నాడు శ్రీ చంద్రశేఖరస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చ జరిగినది. తాలూకా సహాయ విద్యాశాఖాధికారి భవన నిర్మాణ ఆవశ్యకతను వివరించారు.భవనానికిభూమిపేకరణ మొదలైన చర్యలను గైకొనటానికిగాను శ్రీ కైలాస భూమయ్యగారి అధ్యక్షతను ఒక కమిటీ నిర్మించారు. శ్రీ చంద్రశేఖరస్వామి ఉపాధ్యక్షులుగాను, శ్రీ నరసింహారెడ్డిగారు, కార్యదర్శిగాను, శ్రీ కాటివల్లి వెంకటరాజయ్య సహాయ కార్యదర్శిగాను, శ్రీ చింతల బ్రహ్మయ్య కోశాధికారిగాను ఎన్నికైనారు.

భవన నిర్మాణం కోసం కార్యవర్గ సభ్యులు 6000 రూపాయల విరాళాలకు వాగ్దానం చేసారు.

మానభంగం చేసిన నేరానికి ముగ్గురు నీగ్రోలకు మరణ శిక్ష

జార్జియా, ఆగస్టు 12
ఇద్దరు తెల్ల జాతిస్త్రీలను మానభంగం చేసిన నేరానికిగాను ముగ్గురు నీగ్రో యువకులకు విద్యుద్ఘాతం వల్ల మరణశిక్ష అమలు జరపాలనిన్యాయస్థానం తీర్పు నిచ్చినది.

ముగ్గురు నీగ్రో యువకులలో ఒకరి వయస్సు 18, మిగతా ఇద్దరి వయస్సు 22, 24.

మానభంగానికి గురిఅయిన స్త్రీలలో ఒకరు వివాహిత. ఆమె వయస్సు 22సం॥ రాలు, రెండవ స్త్రీ అవివాహిత, ఇరవయిఏడుస్త్రీకి ఈ మె చెల్లెలు వరస అవుతుంది. అవివాహిత వయస్సు 18 సంవత్సరాలు.

12 మంది జూరీలు తీర్పు చెప్పారు. వారిలో 11 మంది తెల్లవారు,-ఒకరు నీగ్రో.

అక్టోబర్ నెల 2వ తేదీన శిక్ష అమలు జరుగుతుంది. ఇనుప కుర్చీలో గూర్చోబెట్టి విద్యుత్తును ప్రసరింప జేయడం ద్వారా శిక్ష అమలు జరుపుతుంది.

వెంటఉన్న తెల్లవారిని తరిమివేసి నీగ్రో యువకులు మొదట స్త్రీలనువశపరచుకొన్నారు. స్త్రీలుపారిపోయి ఇద్దరు నీగ్రోలనుశరణు వేడారు.నీగ్రోలను సైతం ఓడించి యువకులు తిరిగి స్త్రీలను స్వాధీనం చేసుకున్నారు.

శ్రీ బూర్గుల త్రివేండ్రం ఆగమనం

త్రివేండ్రం, ఆగస్టు 12
రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వాధికారులతో చర్చలు జరిపిన అనంతరం కేరళ గవర్నర్ శ్రీ వి. రామకృష్ణారావు ఈరోజు ఉదయం ఇక్కడికి తిరిగి వచ్చారు.

విమానాశ్రయంలో విలేఖరులతో ముచ్చటిస్తూ, తమకు సలహాదార్లుగా ఎవరుండాలనే విషయంపై ఒకటి రెండు రోజులలో నిర్ణయం గైకొనబడుతుందని ఆయన అన్నారు.

కమ్యూనిస్టు ప్రభుత్వ వ్యతిరేకోద్యమ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పులపై విచారణ జరిపించాలని నిర్ణయించారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, ఇంకా ఏ నిర్ణయము జరగలేదని అన్నారు.

ధరవరలు

కొత్తూరు సీతయ్య గుప్త దుకాణం

బుధవారం, 12-8-1959

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్ ఆం. ప్ర.		
సన్న బియ్యము	71-8-0	78-0-0
దొడ్డు బియ్యము	64-0-0	64-8-0
అక్కులు ,,	66-0-0	69-0-0
19 నెం. బి॥	65-0-0	68-0-0
గొట్టె బియ్యము	61-0-0	62-0-0
తెల్ల జొన్నలు	45-0-0	47-0-0
చట్టి ,,	38-0-0	39-8-0
పసుపు	86-0-0	90-0-0
ఎర్రకందులు చి॥	—	—
పెసలు	40-0-0	45-0-0
శనగలు	43-0-0	44-0-0
ఉలవలు	36-8-0	—
తెల్లము	61-0-0	62-0-0
మిర్చి	240-0-0	290-0-0
చింతపండు	120-0-0	155-0-0
ఉల్లిగడ్డ	18-0-0	19-0-0
గోధుమలు	66-0-0	86-0-0
మక్క గోధుమ ,,	75-0-0	—
కుసుమలు	55-0-0	58-0-0
నువ్వులు	100-0-0	115-0-0
ఇలాతిపలుకు చి॥	62-0-0	—
ఇలాతిపలుకు పె॥	96-0-0	97-0-0
ఆముదాలు	61-8-0	61-0-0
పత్తిగింజలు	42-4-0	43-8-0
నూనె	17-6-0	17-8-0
కందిపప్పు పె॥	88-0-0	93-0-0
కందిపప్పు చి॥	78-0-0	82-0-0
మినప పప్పు	73-0-0	75-0-0
పెసర పప్పు	73-0-0	84-0-0
శనగ పప్పు	54-0-0	55-0-0
నిరిశనగ పప్పు	76-0-0	78-0-0
లంకపప్పు	59-0-0	64-0-0
ధనియాలు	127-8-0	142-8-0

దెబ్బడ భూమయ్య నారాయణ

ఫోన్: నెం. 5260

తెజావు బంగారం		121-50
కిసాన్ మార్క్ బి॥		121-25
వెండి తు॥	100 కి	221-00
వెండి తు॥	1 కి	2-03
నవరసు		79-50

ఆంధ్ర, మద్రాసు సరిహద్దు సర్దుబాట్ల బిల్లు

లోక్‌సభలో శ్రీ దాతార్ చే ప్రతిపాదన

న్యూఢిల్లీ,ఆగస్టు 12
పటాస్కర్ అవార్డు ననుసరించి ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలలో సరిహద్దులలో కొన్ని సర్దుబాట్లు చేయటానికి సంబంధించిన బిల్లును దేశవ్యవహార శాఖలోని మంత్రి బి. ఎన్. దాతార్ నేడు లోక్‌సభలో ప్రవేశ పెట్టారు.

ఈ అవార్డు ననుసరించి చిత్తూరు జిల్లాలోని తిరుత్తని, చిత్తూరు, పుత్తూరు తాలూకాలకు చెందిన 318 గ్రామాలు, పాలమనేరు తాలూకాలోని కొంత ఆటవిక ప్రదేశం ఆంధ్ర నుంచి మద్రాసు రాష్ట్రానికి బదిలీ చేయబడతాయి. అలాగే చెంగల్ పట్ జిల్లాలోని తిరువళ్ళూరు, పోన్నేరి తాలూకాలకు చెందిన 148 గ్రామాలు, సేలం జిల్లా కృష్ణగిరి తాలూకాకు చెందిన మూడు గ్రామాలు మద్రాసు నుంచి ఆంధ్ర ప్రదేశ్‌కు బదిలీచేయ బడతాయి.

ఈ బిల్లును ఆంధ్ర, మద్రాసు శాసన సభలు అంగీకరించినవి.

హోటళ్ళ పరిశ్రమ

(2 వ పేజీ తరువాయి)

నుంచే కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

కేవలం హోటళ్ళ వ్యాపారం చేసే వారి సంఖ్య దేశంలో తక్కువగా వున్నందునా. దిన దినం పెరుగుతున్న యాత్రీకుల సంఖ్యను బట్టి వారి అవసరాలను తీర్చడానికిహోటళ్ళ పరిశ్రమ పెంపొందవలసి వున్నందునా, యితర పెట్టుబడి దారుల వద్ద నుంచి పెట్టుబడి సేకరణను నిరోధించడం వాంఛనీయం కాదనీ, అయితే ఎట్టి దుర్నడతలు లేకుండా చర్యలు తీసుకోగలరనీ ప్రభుత్వం వెల్లడించింది.

హోటళ్ళ నిర్వహణ, హోటలు పనులలో శిక్షణకు పాఠశాలలను నెలకొల్పాలన్న సిఫార్సును ప్రభుత్వం ఆమోదించి, త్వరలోనే ఉన్నత శ్రేణి హోటళ్ళ శిక్షణ పాఠశాలను నెలకొల్పుతామనీ. ఇప్పుడు అట్టి శిక్షణ యిస్తున్న సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహించగలదనీ తెలియజేసింది. అన్ని హోటళ్ళ బిల్లుపైన నూటికి 2వంతులు సర్ ఛార్జి విధించి హోటలు పరిశ్రమకు ఉమ్మడి నిధిని ఏర్పాటు చేయాలన్న సిఫార్సును అందుకు సంబంధించిన అధికారులతో సంప్రదించి పరిశీలించగలమని ప్రభుత్వం వెల్లడించింది.

జెట్ విమాన యుగం ప్రారంభమైనందున, విదేశ యాత్రీకుల సంఖ్య కూడా పెరుగగలదనీ, దేశంలోని హోటలు సౌకర్యాలను ఎక్కువ చేయాలనీ, ముఖ్యమైన యాత్రిక కేంద్రాలలో అది మరీ అవసరమనీ, యీ విషయాన్ని ప్రభుత్వం, హోటలు పరిశ్రమ గుర్తించాలనీ సంఘం సూచించింది. ప్రభుత్వం ఆ సూచనలతో ఏకీభవిస్తూ, హోటలు పరిశ్రమ ప్రధానంగా ప్రైవేటు రంగానికి చెంది వున్నందున, తగిన సహాయం చేస్తే వారు కొత్త హోటళ్ళను నెలకొల్పగలరని ప్రభుత్వం భావించింది. హోటలు పరిశ్రమకు సంబంధించిన అన్ని విషయాలకూ సంబంధించిన ఒక సమగ్ర చట్టాన్ని చేయాలన్న సిఫార్సును కూడ ప్రభుత్వం ఆమోదించింది. ఈ సంఘపు యితర సిఫార్సులను కూడా ప్రభుత్వం పరిశీలించినది.

సంక్షిప్త వార్తలు

కాలికట్, ఆగస్టు 12
కాలికట్ పట్టణంలో నెల్లాయిల్ అనే చోట నిన్న రాత్రి ముస్లింలీగ్‌వారు తీసిన ఒక ఊరేగింపుపై కొందరు దాడి జరిపిన ఫలితంగా ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు ఈ ప్రాంతంలో ఇప్పుడు గస్తీ తిరుగుతున్నారు. ఎన్నికల ప్రచారం నిమిత్తం వార్డు కమిటీల స్థాపన సందర్భంగా ఈ ఊరేగింపు తీశారు.

* * *

న్యూఢిల్లీ, ఆగస్టు 11
వచ్చే రెండేళ్ళకోసం దిగుమతి, ఎగుమతి సలహా సంఘాలను భారత ప్రభుత్వం పునర్నిర్మించినదని నేడిక్కడ అధికారికంగా ప్రకటించినది. ఈ సంఘాలు పూర్వంవలెనే ఉంటాయి. దిగుమతి సలహా సంఘ సమావేశం వచ్చే సెప్టెంబర్ 5 వ తేదీన, ఎగుమతి సలహా సంఘం సెప్టెంబర్ 6 వ తేదీన న్యూఢిల్లీలో సమావేశాలు జరుపుతాయి.

* * *

జెనీవా, ఆగస్టు 11
జపాన్‌లో ఉన్న కొరియన్ పౌరులనుస్వదేశానికిపంపివేసేకార్యక్రమంలో జాపనీస్ రెడ్ క్రాస్‌కు సహాయపడటానికి అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంఘం నిర్ణయించినది.

* * *

న్యూఢిల్లీ, ఆగస్టు 11
హిందీయేతర ప్రాంతాలలో హిందీ భాషా ప్రచారం చేస్తున్న సంస్థలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా కాక నేరుగా ఇవ్వాలని పార్లమెంట్ హిందీ సంఘం కోరినది.

కావలెను
ఏరియా రిప్రెజెంటేటివులు మొత్తం రూ. 120 ల జీతం పై కావలెను. ఉద్యోగం శాశ్వతమైనది. ఎక్కువ అవకాశాలున్నవి. రూ. 510 ల స్టాకు నిల్వ చేయువారు, అనుభవజ్ఞులు మాత్రమే దరఖాస్తులు పంపండి.
యూనియన్ ఇండస్ట్రీస్
174, హార్నబై రోడ్, బొంబాయి-1.

రు. 6/- కు వాచీ

15 జ్యూయల్స్ రిస్టు వాచీ 5 ఏండ్ల గ్యారంటీతో రు. 6-కు మా చెయిన్ సిస్టమ్ క్రింద దొరుకును. పోస్టేజి అదనం. మా కామినీ సెంటును ప్రచారం చేయడానికి ఈ స్కీము ప్రవేశ పెట్టబడినది. పూర్తి సంతృప్తి కలుగును. లేనిచో సొమ్ము వాపసు. నేడే వ్రాయండి:
LONDON COMMERCIAL Co
P. B. 2 (W-55) AMRITSAR

స్టాండర్డ్
రోలింగ్ షట్టర్స్
ధర్నాకాలము సేవ మరియు రక్షణలను యిస్తాయి
SRS-59-7 TE EVEREST
డిస్ట్రిబ్యూటర్స్: కామ్ ట్రేడ్స్ (ఇండియా), 2598-కింగ్స్ వే, ఈమాజీ మేన్షన్, సికిందరాబాద్-3, ఫోన్ నెం. 74647

ముద్రణ * ప్యాకింగ్
లేఖనము * ర్యాపింగులకు
సిర్పూరు కాగితమును
ఉపయోగించండి
ఆర్ట్ పేపర్, క్రోమోబోర్డులతో సహా అన్ని రకములైన కాగితములను తయారు చేయుచున్నాము
క్రీమ్‌లెయిడ్, కలర్ ప్రింటింగ్ మా ప్రత్యేకత
ది సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్
సిర్పూర్-కాగజ్‌నగర్, సెంట్రల్ రైల్వే.

వరంగల్ పురపాలక సంఘం వ్యవహారం

మంత్రులకు విజ్ఞాపన పత్రం సమర్పణ

వరంగల్, ఆగస్టు 10

వరంగల్ పురపాలక సంఘం పార్టీకి చెందని వ్యవహారంగాను, అధ్యక్షుని యొక్క, సంఘ ఉద్యోగుల యొక్క స్వగృహ కార్యకలాపంవలె జరిగి పోతున్నదనీ, దాదాపు 40 వేల రూపాయలు బకాయిలను సంఘం సమ్మతి లేకుండానే బకాయిలు ఖాతాల్లో కొట్టివేశారని కొందరు సభ్యులు స్థానిక స్వపరిపాలన శాఖామంత్రి శ్రీ సంజీవయ్యగారికి, ముఖ్య మంత్రి శ్రీ సంజీవరెడ్డిగారికి దరఖాస్తు సమర్పించారు. మంత్రిగారు స్థానిక సంస్థల ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను విచారణ చేయుటకు పంపుతామని హామీ ఇచ్చినట్లు శ్రీ వి. సత్యదేవ్, శ్రీ మదూరి శంకర్లింగంగార్లు తెలియజేసారు.

మంత్రిగారికి సమర్పించిన దరఖాస్తులో ఇట్లావుంది:

"పురపాలక సంఘాధ్యక్షుని పై కొన్ని ఆరోపణలతో ఈ మధ్య అధిక సంఖ్యాకులైన కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాసం ప్రకటిస్తూ ప్రదేశ్ కాంగ్రెసుకు విజ్ఞాపన పంపుకొనగా విచారణ జరుగుతున్న సందర్భంలో పురపాలక సంఘ కార్యనిర్వహణాధికారి రంగశాయిపేట వార్డు కాంగ్రెస్ సభ్యునికి వ్యతిరేకంగా కాంగ్రెసేతరులు కొందరు జరిపిన సమావేశంలో పాల్గొని వ్యతిరేక ప్రసంగాలు చేసినారు. అధ్యక్షుని పేష్కారుగా ఉద్యోగి అయిన ఇతడు రాజకీయ సమావేశంలో పాల్గొనటం పూర్తిగా క్రమవిరుద్ధచర్య కాగలదు. ఇంతేగాక పరిపాలన యథేచ్ఛగా కొనసాగిస్తూ లోపాలను తెల్పినా సరిచేయుట లేదు".

పశు వైద్య శాలలు

హైదరాబాద్, ఆగస్టు 12

కర్నూల్ జిల్లా కంభం, బెల్లూరు జిల్లా చిదవలూరు, తూర్పు గోదావరి జిల్లా తునిలో ఒక్కొక్క ప్రదేశంలో ఒకటి చొప్పున మూడు పశువైద్యాలయాలను తెరవడానికి సంబంధించిన ఒక ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం కంభంలో పని చేస్తున్న చిన్నరకం పశువైద్యశాల పాపినేనిపల్లికి మార్చబడుతుంది.

బొంబాయి కార్పొరేషన్‌లో పి.ఎస్.పి. సభ్యుల రాజీనామా

కెరళ-తీర్మానంపై సంయుక్త మహారాష్ట్ర సమితి సభ్యులలో విభేదాల ఫలితం

బొంబాయి, ఆగస్టు 11

బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్‌లో సంయుక్త మహారాష్ట్ర సమితి జిల్లాకు చెందిన 28 మంది పి. ఎస్. పి. కౌన్సిలర్‌ల రాజీనామాలను ప్రజా సోషలిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. జి. గోరేనేడెక్కడ సమితి పార్లమెంటరీ బోర్డుకు సమర్పించారు.

మహారాష్ట్ర పి. ఎస్. పి. స్థాయీ సంఘం ఆదేశాన్ననుసరించి కార్పొరేటర్ల రాజీనామాలు నిన్నరాత్రి సేకరించబడినవి. వాటిని సమితి పార్లమెంటరీ బోర్డుకు సమర్పించటానికి శ్రీ ఎస్.జి. గోరేకు అధికార మిచ్చారు.

సమితి పార్లమెంటరీ బోర్డు సభ్యులలో ఒకరు సమితిలో ఒక భాగమైన "జనతా అఘాడి" పార్టీ నాయకుడు అయిన శ్రీ పి.కె. ఆత్రే పి.ఎస్.పి. సభ్యులకు విరుద్ధంగా సాగిస్తున్న నిరంతర దుష్ప్రచారానికి నిరసనగా ఈ రాజీనామాలు ఇవ్వబడినవని తెలుస్తున్నది. కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పక్షం ప్రవేశ పెట్టిన కేరళ తీర్మానంపై చర్చ సందర్భంలో పి. ఎస్.పి. వారు కాంగ్రెస్‌కు అనుకూలమైన వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించి, వారు తమ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి తిరిగి ఎన్నికలలో పోటీచేయాలని కోరుచూ శ్రీ ఆత్రే తమ పత్రికలో ఒక వ్యాసం వ్రాసారు.

ఇలాటి విషప్రచారాన్ని అరికట్టే ఉద్దేశంతో పి. ఎస్. పి. స్థాయీ సంఘం ఆయన సవాలును ఎదుర్కొన్నదని ఒక పి.ఎస్.పి. కార్పొరేటర్ అన్నాడు.

రాజీనామా పత్రాలపై నిర్ణయం గైకొనబడే వరకు మూడు కార్పొరేషన్ సమావేశాలకు హాజరుకారాదని స్థాయీ సంఘం సభ్యులను ఆదేశించినది.

రాజీనామా ఇచ్చినసభ్యులు కూడా సంయుక్త మహారాష్ట్ర స్థాపనకు జరిగే కృషిలో పాల్గొంటూనే ఉంటారని స్థాయీ సంఘం స్పష్టీకరించినది.

సప్లిమెంటరీ డిమాండ్లు

(1 వ పేజీ తరువాయి)

సరఫరాలు, ఉచితంగా పుస్తకాలు వగైరా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. జిల్లాలలో వైద్య సౌకర్యాల కొరత గురించి కూడా శ్రీ నాగిరెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. గుంటూరు తదితర ప్రదేశాలలో గల ఆయుర్వేద ఆస్పత్రులను మూసి వేయటానికి నిర్ణయించినందున కూడా శ్రీ నాగిరెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు.

రోడ్డు మార్గాలకు కూడా ఆదు పాయల అవసరం కలదు. ఖర్చుతగ్గించి అందజేయాలని కాంగ్రెస్ సభ్యుడు శ్రీ పి. గున్నయ్య అన్నారు.

రాష్ట్రంలోని విద్యా కేంద్రాలన్నిటిలోను సాయం కళాశాలలను ప్రారంభించాలని, ఆహార ధరలను తగ్గించాలని ఎస్. డి. పి. సభ్యుడు శ్రీ వి. ఆదినారాయణ అన్నారు.

స్వతంత్ర పార్టీ సభ్యుడు శ్రీ రాగోపాల నాయుడు చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో జామ పరిస్థితులు ఏర్పడినవని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకొనవ పోతే, పరిస్థితి చెయ్యిదాటి పోగలదని ఆయన అన్నారు. జిల్లాలలో కూడా వెంటనే చౌక దుకాణాలను తెరవాలని ఆయన అన్నారు.

కొత్తగా స్థాపించ దలచిన వ్యవసాయిక కళాశాలను మదనపల్లిలో నెలకొల్పాలని కాంగ్రెస్ సభ్యుడు శ్రీ గోపాల కృష్ణ గుప్త కోరారు. రాజకీయ బాధితుల పిల్లలకు ఉచిత విద్యా సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం నిర్ణయించినందుకు హర్షం వెలిబుచ్చుతూ, కనీసం ఆరు నెలలైనా జైలు శిక్ష అనుభవించి ఉండాలన్న నిబంధనను తొలగించాలని ఆయన కోరారు.

వైద్య సౌకర్యాలను కల్పించటంలో కుంటి పాటిను, రెవెన్యూ శాఖపట్ల ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నదని శ్రీ బి. నరసింహారెడ్డి (కమ్యూనిస్టు) అన్నారు.

తిరుగుబాటు నిరోధకవర్గంలో అంచనాలు నిర్ధారణగా ఉన్న నాలుగు మైనర్ జరిగేషన్ పథకాలను ముందుకు తీసుకువలసిందిగా శ్రీ పేట బాపయ్య (కాంగ్రెస్) ప్రభుత్వాన్ని కోరారు.

పేదల ప్రయోజనాలకోసం వనీసం ఒక సంవత్సర అస్థిత్వానైనా ఏర్పాటు చేయాలని ఎస్. డి. పి. సభ్యుడు శ్రీ డి. శ్రీరామమూర్తి అన్నారు.

పాంథుర సంక్షేమ పథకాల క్రింద [illegible] అభివృద్ధికి కేటాయించిన [illegible] స్వాధీనం కావటంలేదని [illegible] సాహెబ్ (కాంగ్రెస్) అన్నారు.

స్వతంత్ర సభ్యుడు శ్రీ దివి కొండయ్య పల్లాలలో సూర్యమిర పంటశాలను ప్రారంభించటానికి ప్రజలు ఎంత విరాళం ఇవ్వాలో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని కోరారు. పచ్చిగబయళ్లు పంటలోపున్నా లేదోయినా, వాటిలో [illegible] మేపుకుంటున్న పశువులకు దారులను పట్టాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

రాజకీయ బాధితుల పిల్లలకు ఉచిత వసతులు ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయించినందుకు శ్రీ బి. నరసింహమూర్తి (కమ్యూనిస్టు) కృష్ణా జిల్లాలలో నిట మునిగిన ప్రాంతాలలో పన్ను వసూలు చేయరాదని అడిగిన అన్నారు.

వైద్య సౌకర్యాలను పాలాంతరుకు [illegible] జరిగేంతవరకు శ్రీ [illegible] అన్నారు.

300 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు రాజకీయ బాధితుల పిల్లలకు స్వీకరించిన నమూనాలను ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి సమర్థించారు.

మదనపల్లి ప్రాంతంలో ఇటీవల పరిస్థితులు దర్శనమైనట్లు ప్రభుత్వానికి తెలుసునని, ఎట్టి ప్రమాదం సంభవించకుండా చూడటానికి ప్రభుత్వం తీసుకోవలసిన మారణ చర్యలన్నిటినీ తీసుకోవ గలదని శ్రీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు.

సభ్యులు ప్రతిపక్షాల వారి కోతల విన్యాసాలను తిరస్కరించి, గ్రాంటులను ఆమోదించారు.

హైదరాబాద్, ఆగస్టు 12

ఆంధ్రప్రదేశ్ భారత కాంగ్రెస్ సంఘం కృష్ణ గోదావరి జిల్లా, పశ్చిమజిల్లా కార్యకర్తలు అచ్చటి పరిస్థితులపై సమావేశం ఒక్కొక్కరికి 1,000 పాత పత్రములను, 1,100 శ్వేత బియ్యం [illegible] ఆమోదించినది.

Edited by Sri K.S. Subrahmanyam. Published by Smt. Sita Yedlavin, and Printed at the Janatha Press, Gandhi Bhavan, Mahaprabhu Marg, Hyderabad-Dn.

మరణ శిక్ష అమలు

ఆరుగురి ఉరితీత

హైదరాబాద్, ఆగస్టు 12

కడప జిల్లాకు చెందిన ఆరుగురు వ్యక్తులకు వారు చెంచు చిన్న వెంకటరెడ్డి, చప్పిడిచిన్న రాములు, బిడెవలకోని రెడ్డి అనే ముగ్గురు వ్యక్తులను ఎసమల చింతల అనే గ్రామంలో 1957 మే 24వ తేదీన హత్యచేసిన నేరానికి కడప అదనపు సెషన్స్ జడ్జి మరణ శిక్షలను విధించారు. ఈ శిక్షలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధృవపరిచింది. నేరస్థులు రాజమండ్రి సెంట్రల్ జైలులో గత నెల జులై 13వ తేదీన ఉరితీయబడినారు.

ఉరితీయబడిన వారి పేర్లు ఇవి: ఉప్పర చిన్న పుల్లప్ప, బోరెడ్డి పెద్ద అప్పరెడ్డి, జంబు లక్ష్మీరెడ్డి, చెంచు పెద్ద రామిరెడ్డి, చెంచు చిన్న రామిరెడ్డి, ఉప్పర బాలపిచిగారి సుబ్బన్న.

ప్రి ఇంజనీరింగ్ కోర్సు

హైదరాబాద్, ఆగస్టు 12

ఆంధ్ర ప్రాంతంలో ప్రి ఇంజనీరింగ్ కోర్సులో తెలంగాణా విద్యార్థులకు కొన్ని స్థానాలు లభ్యం కాగలవని సేదు [illegible] అన్నారు. ఐఛ్ఛంలో 70 శాతం సీట్లు ఎక్కువ మార్కులు పొందిన హైదరాబాద్‌లో ప్రవేశం లభించని విద్యార్థులు ఆంధ్ర ప్రాంతంలో ఏదైనా కళాశాలలో ప్రవేశం పొందగోరినచో ఉన్నతాధికారి విద్యార్థులకు తగిన సర్టిఫికేట్లు పంపుతారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు సర్టిఫికేట్లు పెట్టినచో, ఆ కళాశాల సమావేశం చేయుచున్న సందర్భంలో తమ దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు ఆయా దరఖాస్తులలో పేర్కొనాలి.

కేరళ ప్రస్తుత పరిస్థితి

విలేఖరులతో గవర్నర్ గోష్ఠి

మధుర, ఆగస్టు 12

"కేరళ వ్యవసాయ సంబంధాల బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టరూపం ధరించి దానిని అమలుపరచటంలో చిక్కులేమీ ఉండవని గవర్నర్ శ్రీ బూర్గుల రామకృష్ణారావు నేడిక్కడ విమానాశ్రయంలో విలేఖరులతో ముచ్చటిస్తూ అన్నారు.

ఢిల్లీలో సంప్రదింపులు జరిపి తిరిగి వస్తున్న శ్రీ రావు ఆ బిల్లు ఇప్పటికే రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నదని అన్నారు. దాన్ని ప్లానింగ్ కమిషన్, కేంద్ర వ్యవసాయ శాఖ మాత్రమే పరిశీలనలో ఉన్నవలసి ఉన్నదని ఆయన అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు: "ఈ బిల్లును ఆమోదింపజేయటానికి కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం చాలా ఆతృత పడుచున్నది."

విద్యా చట్టాన్ని ఇప్పుడు అమలు పరుస్తారా అని ప్రశ్నించగా చట్టం అమలుపరచటం ఇదివరకే ప్రారంభమైనది అని అన్నారు.

చట్టంలోని వివాదాస్పదమైన సెక్షన్ ను సస్పెండ్ చేస్తారా అన్న ప్రశ్నకు ఆయన ఇలా సమాధానమిచ్చారు: "అత్యంత వివాదాస్పదమైన సెక్షన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉపాధ్యాయుల సెలెక్షన్, నియామకాలకు సంబంధించినది. అది దాదాపుగా సస్పెండ్ అయింది. ఎందుకంటే చట్టం అమలులోకి వచ్చిన వేళాది తర్వాత కాని ఆ సెక్షన్ అమలులోకి రాదు. ఇతర వివాదాస్పద సెక్షన్‌ల విషయంలో వివిధ వర్గాలతో సంప్రదింపులు జరిపి చట్టానికి తుది స్వరూపమివ్వవలసి ఉంటుంది."

గవర్నర్‌కు ఇష్టం, ముగ్గురు సభ్యులు [illegible] ప్రస్తావించగా ఇష్టం ఉన్నదని ఆయన అన్నారు. "ఎందుకంటే ఎన్నికల వ్యవహారం చూచుకోటానికి ఒకరు, పరిపాలనా వ్యవహారాలు చూడటానికి మరొకరు అవసరం. ఎన్నికలే లేకపోతే ఒకరైనా చాలు" అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతపరిస్థితి గురించిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఎక్కడ? ఒకటి రెండు సంఘటనలు తప్ప రాష్ట్రంలో మరెక్కడా అల్లర్లు జరిగినట్టు తమకు తెలియదని ఆయన అన్నారు. ఆ రెండు, మూడు సంఘటనలు కూడా ఆ యా పార్టీల నాయకులు వారించినప్పటికీ జరిగాయని అంత పెద్ద ఉద్యమం జరిగిన తర్వాత, ప్రజలలో వైషమ్యాలు వెంటనే తొలగిపోవాలంటే సాధ్యం కాదని ఆయన అన్నారు.

ఈ సంఘటనల గురించి ఫిర్యాదులు చేసిన కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఎ. కె. గోపాలన్ ఢిల్లీలో తమను కలసి, తగు చర్యలు గైకొన బడతాయని తనకు హామీ లభించినట్టు అయనే ప్రకటన చేశారని శ్రీరావు చెప్పారు.

తమరు రొమ్ములోను, పొత్తికడుపులోను కొప్పిగా ఉంటున్నారని ఆయన చెప్పారు. "నాకు విశ్రాంతి అవసరంకాని దూరకటం లేదని అనుకుంటున్నాను" అన్నారాయన.

సాగర్, ఆగస్టు 12

ఇటీవల [illegible] పరిస్థితులు [illegible] పులిదాస్ పర్యటించి పరిశీలించారు.

బాణాసంచా అమ్మకం

హైదరాబాద్, ఆగస్టు 12

రానున్న దీపావళి పండుగ సందర్భంలో హైదరాబాదు, నిజాంబాదు నగరాలలోని ఈ క్రింది స్థలాలలో మాత్రమే బాణాసంచా అమ్మకం అనుమతి ఇస్తారు:

హైదరాబాదు: లింగంపల్లి బాగ్ (బర్కట్‌పూర్ వద్ద); ఎగ్జిబిషన్ మైదానం మొదలుజాపి రోడ్డు.

నిజాంబాదు: త్రిమల్‌గిరి, బాసారెడ్డిగూడా, దసాయిశాల, బోలారం పాయిసిర్ బజార్, బోలారం, బోయెన్‌పల్లి, పద్మామియా ఉన్నత పాఠశాల ఆటస్థలం.

భారత ప్రభుత్వ ప్రేలుడు పదార్థముల శాఖ చేసిన సూచనల మేరకు యీ ఏర్పాటు చేయడమైనది. ఈ స్థలాలలో తప్ప మరెచ్చటా బాణాసంచా విక్రయానికి అనుమతి ఇవ్వబడదు.

బాణా సంచా అమ్మకం దారులు పై స్థలాల యజమానుల అనుమతి పొందిన తరువాతే లైసెన్సుల కొరకు పోలీసు కమిషనరు వద్ద దరఖాస్తులు పెట్టుకోవాలి.

పౌరాణిక నివాసం

హైదరాబాద్, ఆగస్టు 12

హైదరాబాద్ జాంబాగ్ రోడ్‌లోని ఆంధ్ర ప్రైవేట్ కంపెనీ యజమానులకూ, శ్రీ మొహమ్మద్ గౌస్ అనే ఆ కంపెనీ మాజీ ఉద్యోగికీ మధ్య అతడు ఉద్యోగం నుంచి తొలగింపబడిన విషయంలో ఏర్పడిన పారిశ్రామిక వివాదం, పరిష్కారం కొరకు హైదరాబాద్‌లోని కార్మిక న్యాయ స్థానానికి నివేదింపబడినది. ఈ వ్యవహారంలో హైద్రాబాద్ దుకాణముల ఉద్యోగుల సంఘం శ్రీ గౌస్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నది.

చెరకు పంట పోటీ

హైదరాబాద్, ఆగస్టు 12

ఆంధ్ర ప్రదేశ్‌లోని 10 జిల్లాలలో 1959-60వ సంవత్సరంలో జనవరి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీవరకు చెరకు పంట పోటీ నిర్వహించడానికి ప్రభుత్వం ఆమోదించింది. ఇదే పది జిల్లాలలో గ్రామీణ సంవత్సరం కూడా ఇటువంటి పోటీ జరుపబడినది. ఈ పోటీకై నిర్ణయించబడిన పద్ధతులే యీ యేడాది కూడా అవలంబింపబడతాయి.

ఈ క్రింది విధంగా బహుమతులు ఇవ్వబడతాయి:

1. రాష్ట్ర బహుమతి (ఒకటి) రూ. 500. ఈసొమ్ము రొక్కంగా గానీ, వస్తురూపంలో గానీ, జాతీయ పొదుపు సర్టిఫికెట్ల రూపంలో గానీ బహుమానగ్రహీత కోరిన ప్రకారం ఇవ్వబడుతుంది. రూ. 120 విలువచేసే ఒక స్వర్ణ పతకం కూడా బహూకరింపబడుతుంది.

2. జిల్లా బహుమతులు:—రూ. 100. చెరకు పండించు పది జిల్లాలకూ ఒక్కొక్క దానికి ఒకటి చొప్పున పది రొక్కం బహుమతులు.

3. తాలూకా బహుమతులు:— ప్రతి తాలూకాకు ఒక బహుమతి చొప్పున 50 వస్తు బహుమతులు.

చెరకు అడసాలి పంట పోటీ (నిజామాబాదు జిల్లాలో మాత్రమే.)

1. జిల్లా బహుమతులు:— (ఒకటి) రూ. 100 లు.

2. తాలూకా బహుమతులు:— (ఆరు) రూ. 50 ప్రతి తాలూకాకు ఒకటి చొప్పున ఆరు వస్తు బహుమతులు.

ఎక్సాల్ (12 నెలలు) చెరకు పంటలో గరిష్ఠ దిగుబడి సాధించడానికి ఈ పోటీ ఉద్దేశింపబడింది. చెరకు ఏరకపు దైనా కావచ్చు. పైరు ఏదైనా పద్ధతిలో వేయవచ్చు. పైర్లకోత సమయంలో (1959 డిసెంబరు నుంచి 1960 మే వరకు) దిగుబడి అంచనాలు కట్టబడతాయి.

శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, చిత్తూరు, అనంతపురం, కడప, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో చెరకు పండించే వారందరూ యీ పోటీలో పాల్గొన వచ్చు. ప్లాటులు పైబడి 50 సెంట్లకు తక్కువ గాకుండా ఉండవలెను. ఒక్కొక్క ప్లాటుకు రు. 1 చొప్పున ప్రవేశ రుసుం చెల్లించాలి.

బాగ్దాద్, ఆగస్టు 11

సహారాలో ఫ్రాన్స్ అణ్వస్త్ర ప్రయోగం చేయటానికి నిర్ణయించటం ప్రపంచ శాంతికి భంగకరమని ఇరాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు నేడు అన్నారు.

తైపే, ఆగస్టు 11

ఇటీవల వరదల వల్ల నష్టపడిన 2,50,000 మందికి సహాయం అందజేయటానికిగాను కోమింటాంగ్ చైనీస్ ప్రభుత్వం చర్యలు గైకొంటున్నది.

తాలూకా పంచాయతీ అధ్యక్షుల సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 11

జిల్లా పరిషత్తుల బిల్లు అంగీకారం, ఆర్థికాభివృద్ధిలో పంచాయతులు నిర్వహించవలసిన పాత్రను వివరించడానికి గాను తాలూకా వారీగా పంచాయతీ బోర్డు అధ్యక్షులతో కాంగ్రెస్ వాదుల సమావేశాలను ఏర్పాటు చెయ్యవలసిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా కాంగ్రెస్ సంఘాలను ఆదేశించినది.

పి. సి. సి. ప్రధాన కార్యదర్శి శ్రీ వి. బి. రాజుగారు ఆగస్టు 17వ తేదీన దేవరకొండలోను, ఆగస్టు 24వ తేదీన మిర్యాలగూడలోను పంచాయతీ అధ్యక్షుల సమావేశంలో ప్రసంగిస్తారు.

వరంగల్ ఫ్రెండ్స్ అసోసియేషన్

వరంగల్, ఆగస్టు 10

ఫ్రెండ్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ రోజు ఉదయం స్థానిక రామలింగేశ్వరాలయంలో శ్రీ దిట్టెల హనుమంతరావు అధ్యక్షతన జరిగి నూతన సంవత్సర కార్యవర్గసభ్యులుగా ఈ క్రిందివారు ఎన్నికైనారు:

అధ్యక్షులు శ్రీ కొమురవెల్లి పీరభద్రయ్య, ఉపాధ్యక్షులు శ్రీ కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శ్రీ సముద్రాల కిషన్‌రావు, సంయుక్త కార్యదర్శులు పుల్లూరు కృష్ణమూర్తి, కె. వీరమల్లు, కోశాధిపతి బండారి అర్జునరావు.

స్టాక్‌హోల్మ్, ఆగస్టు 12

కొట్టాల్‌కరా సరిహద్దుగా నిన్న రాత్రి రెండుపక్షాల మధ్య జరిగిన కొట్లాటలో నలుగురికి కత్తిపోట్లు తగిలినవి.



కలకత్తా నివాసులలో ఉన్న బారన్ పూర్‌లో 1950 సంవత్సరంలో ఇంద్ర గాజు, సింగాణి పరిశోధన సంస్థను స్థాపించారు. మన దేశంలో పెద్దజాతీయ పరిశోధనాలయాలలో యిది ఒకటి. ఈచిత్రంలో సిన్నల్ గ్లాసును తయారు చేస్తున్న దృశ్యాన్ని చూడవచ్చు.

వెల్కం అమ్యూజ్‌మెంట్ పార్కు ఉద్ఘాటన

వరంగల్, ఆగస్టు 10

శ్రీ వి. రాజేశ్వరరావు, శ్రీ యం. సత్యనారాయణరావు, శ్రీ సి. టి. మాధవరెడ్డి, శ్రీ [illegible] రాజమౌళి ప్రభృతులు జిల్లా కార్యదర్శితో స్థానిక "వెల్కం అమ్యూజ్‌మెంట్ పార్కు" లోని [illegible]ను గూర్చి విన్నవించుకొన్నారని ఆంధ్రజనత పాఠకులకు విదితమే. ఆ పార్కు కార్యక్రమాలను వెంటనే నిల్చివేయ వలసిందిగా ఉత్తర్వు జారీచేశారు. స్కిల్ గేమ్సు పేర జూదమూ, డ్యాన్సింగ్ పేర అసభ్య వ్యవహారమూ జరుగుతున్నవని వీరు చెప్పినట్లు తెలుస్తున్నది. -మా. వి.

మీ రాష్ట్ర అభివృద్ధి ఋణాలలో ఇతోధికంగా పాల్గొనండి

4 శాతం 1971 రాష్ట్ర అభివృద్ధి ఋణాలలో 1959 ఆగస్టు 19 వ తేదీ వరకు చందాలు వేయవచ్చును.

ఏ రాష్ట్రాలలో కెనరా బ్యాంకు ప్రాతినిధ్యం వహిస్తోందో ఆ రాష్ట్రాల అభివృద్ధి ఋణాలలో ఈ బ్యాంకు మూడు కోట్ల రూపాయలకు పైగా చందా వేస్తుంది.

రాష్ట్రాల అభివృద్ధి ఋణాలలో పాల్గొనే పీలుసు కల్పించడానికి గాను కెనరా బ్యాంకు తమ వేతనములు ప్రలోభ సమంజసమైన నిబంధనలపై ఋణాలనుకూడా ఇస్తుంది.

వివరాలకై మీకు సమీపంలో ఉన్న బ్రాంచ్ మేనేజరును కలవండి.

కెనరా బ్యాంక్ లిమిటెడ్

వ్యవస్థాపన : 1906

-: ప్రజా సేవ చేస్తున్న బ్యాంకు :-

రేపు మధ్యాహ్నం 3-30 గంటలకు గొప్పవిజయము!

ప్రేమ, త్యాగము... వీటికి సంబంధించిన దివ్యమైన కథనుకలిగి, వీనులవిందైన గొప్ప సంగీత చిత్రరాజం



ఫిల్మిస్తాన్ వారి

దీప్ జ్యోతి

తారాగణం: అభిభట్టాచార్య, రణధీర్, మంజు, రంజన నటించినది.

దర్శకత్వం: దత్తాథర్మాధికారి | సంగీతం: రోషన్ | పాటలు: శైలేంద్ర

లిబర్టీ - హైదరాబాద్ దీపక్ - బారూన్

ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30

(Nima)

ఆగస్టు 15 వ తేదీ శనివారంనాడు

బ్రహ్మాండమైన విడుదల!

ప్రప్రథమంగా మనదేశములో

తెలుగులో తయారైన పూర్తిపంచరంగుల జంగల్ చిత్రం

బసంత్ పిక్చర్స్ వారి

జింబో (తెలుగు)

నటీనటులు: ఆజాద్, చిత్ర, పెంపుడు కోతి పెడ్రో

కమల్ టాకీస్ - హైదరాబాద్

(Nima) ఆటల సమయాలు: 3-00, 6-15, 9-30

— చిత్ర రిలీజ్ —

14-8-59న బ్రహ్మాండమైన విడుదల!

ద్వాపరయుగంలో ధర్మంనశించి, సన్మార్గుల ఉనికి నశించి, దుర్మార్గుల పాపకార్యాలు విజృంభించడంతో ధర్మం ప్రతిష్ఠించడంకోసం శ్రీ కృష్ణుడుగా భువి నవతరించిన శ్రీ మహావిష్ణువు లీలలు ఉత్తమంగా చిత్రింపబడినవి.

తా: రంగారావు, లేలంగి, గుమ్మడి, సూరిబాబు, పద్మనాభం, కుటుంబరావు, సంధ్య, నల్ల రామమూర్తి, బాలకృష్ణ, లక్ష్మీరాజ్యం, శ్రీరంజని, సూర్యకాంతం, రీటా, బేబీ ఉమ.

ప్యాలెస్ హైదరాబాద్ రాజేశ్వర్ సికిందరాబాద్ రామా వరంగల్

శుక్రవారం 3 ఆటలు: 2-20, 6-00, 9-30 గం॥

శని, ఆదివారములు 4 ఆటలు: 11-30, 2-30, 6-00, 9-30గం॥

17-8-59 నుండి, 20-8-59 వరకు రెండు థియేటర్లలోను 2-30 గంటలకు ప్రత్యేక మ్యాటినీలు.

(Trupix) సప్తయుగ విడుదల.